J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 44 8.4.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### ఉత్సాహం - ఉత్తేజం - ఉత్కంఠ

### మంత్రిపదవి లేకపోతే పాయే.. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్టైనా వస్తుందా..?

# వైసిపి ఎమ్మెల్యేలలో కొత్త భయం!

## ఆయన... పోయివచ్చెను హస్తినకు!

10లో








**ఆం**ధ్రాలో మంత్రివర్గ మార్పునకు కౌంట్‌డౌన్ మొదలైపోయింది. మరో రెండు రోజుల్లో ఉండేదెవరో ఊడేదెవరో తేలడంతో పాటు కొత్త వారి పేర్లు కూడా బహిర్గతమవుతాయి. ఈ తరుణంలో ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో కొత్త చర్చకు తెరలేసింది. మంత్రి పదవి సంగతి సరే.. వచ్చే ఎన్నికలలో తమకు సీటైనా ఇస్తారా...? లేదా..?? అన్న అనుమానం చాలామందిలో మొదలైపోయింది. తన దగ్గర అందరి జాతకాలూ ఉన్నాయని, వారి పనితీరు ప్రామాణికంగా రాబోయే ఎన్నికలలో టిక్కెట్లు ఇస్తానని ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు. అయితే, 150 మందిలో ఈసారి 90 మందికిపైగా టిక్కెట్లు రావన్న పుకారు కూడా జోరుగానే షికారు చేస్తోంది.

**గ**తంలో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ఎదురులేని పార్టీగా చలామణి అవుతున్న రోజుల్లో తెలుగుదేశం పుట్టింది. ఆ పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావుకి మొండివాడు, అహంభావి అన్న పేరు ఉన్నా ఆయన జనరంజక పాలకుడిగా పేరుతెచ్చుకున్నారు. ఆంధ్ర రాజకీయాలలో ప్రాంతీయపార్టీ హవా తెలుగుదేశం హయాం నుండే మొదలయ్యింది. అప్పట్లో ఒకేసారి తన మంత్రి

10లో




పాఠకులకు, ప్రకటనకర్తలకు,
చందాదారులకు, మిత్రులకు
శ్రేయోభిలాషులకు
**శ్రీరామనవమి శుభాకాంక్షలు**
- సం/-

# 24 మంది మంత్రుల రాజీనామా



**ఆం**ధ్రప్రదేశ్ మంత్రివర్గంలో మార్పులు, కూర్పులు, చేర్పులు జరగనున్న తరుణంలో 7వ తేదీ గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ తుది సమావేశం జరిగింది. జగన్ నాయకత్వంలో ఏప్రిల్ 11 నుండి కొత్త మంత్రివర్గం రాష్ట్రంలో పరిపాలన సాగించనున్న తరుణంలో పాత మంత్రులకు ఇదే చివరి సమావేశం. ఈ సమావేశంలో పాత మంత్రులు మొత్తం 24 మంది తమ రాజీనామాలను ముఖ్యమంత్రికి అందించారు. ముఖ్యమంత్రి జగన్ చిరునవ్వుతో నవ్వుల పువ్వుల మధ్య మొదలైన ఈ సమావేశం, 36 అంశాలపై చర్చ జరిపి, చివరికి 24 మంది రాజీనామాలతో ముగిసింది.






## 'శ్రీరామ కథాసారం'.. అద్భుతం

ఎన్నిసార్లు విన్నా, పలికినా తనివితీరని రామాయణ ఇతిహాసాన్ని 'శ్రీరామ కథాసారం' నృత్యరూపకంలో కళ్ళకు కట్టినట్లుగా చూపిన విధానం ఎంతో తన్మయత్వానికి, మధురానుభూతికి గురిచేసిందని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు చెప్పారు.

ఉగాది రోజైన ఏప్రిల్ 2వ తేది సాయంత్రం నగరంలోని శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో హైదరాబాద్‌కు చెందిన కళారత్న గురుశ్రీ పసుమర్తి రామలింగశాస్త్రి వారి బృందం ప్రదర్శించిన 'శ్రీరామ కథాసారం' నృత్య రూపకం అద్భుతంగా ఉందని ఆయన ప్రశంసించారు. పరిపూర్ణ మానవుడు, దేవుడైన శ్రీరాముడిని ఇటువంటి కళల ద్వారా అందరికీ పరిచయం చేయడం గొప్ప విషయమన్నారు. ప్రజలందరికీ మంచిని పంచాలనే సదుద్దేశంతో ఇటువంటి నృత్య రూపకాలు రూపొందిస్తున్న కళాకారులను ప్రోత్సహించవలసిన అవసరం ఉందన్నారు. ఇంతటి గొప్ప నృత్య రూపకాన్ని ప్రదర్శించిన పసుమర్తి రామలింగశాస్త్రి వారి బృందాన్ని నెల్లూరు జిల్లా ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. ఈ రూపకంలో ప్రతి పాత్రలోని కళాకారులు హావభావాలను ప్రదర్శించడంలో ఒకరితో ఒకరు పోటీపడినట్లుగా కనిపించింది. ముఖ్యంగా శూర్పణఖ పాత్రధారి తన హావభావాలను అత్యద్భుతంగా పలికించారు. శ్రీరామునిపై ప్రేమను చూపే విధానంలో, సీతమ్మను ద్వేషించే విధానంలో గానీ తన హావభావాల ప్రదర్శనా తీరు చూపరులను ఆకట్టుకుంది. అయితే ఆ కళాకారిణి మరెవరో కాదు.. ప్రముఖ సినీ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ భార్య సౌజన్య కావడం విశేషం. అదేవిధంగా జాంబవంతుడు పాత్ర పోషించిన సురేష్, మరో పాత్రలో ఒదిగిన కళాకారిణి అరుణ జిల్లాలోని కొడవలూరు, కావలి ప్రాంత వాసులు కావడం మరో విశేషం. అనంతరం పసుమర్తి రామలింగశాస్త్రిని కలెక్టర్ దుశ్శాలువతో సత్కరించి, కళాకారులందరికీ మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుటుంబసభ్యులతో పాటు జాయింట్ కలెక్టర్ హరేందిర ప్రసాద్, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ కుమారి జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి, డిపిఒ ధనలక్ష్మి, నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ పాల్గొన్నారు.

## లోకాభిరామం.. శ్రీరామం!...



కం. రాముని చరితము తెలియని
గ్రామము వెదకిన జగమున కాంచం గలమా?
భూమాత పుత్రిక, సీ
తా మాత నెరుగని వారు ధరణింగలరే!...

సీ. అల అయోధ్యాపురి నావిర్భవించి, ఆ
గాధేయు యజ్ఞంబు గాచినావు
శాపంబు బోగొట్టి చాపంబునే ద్రుంచి
సీతనే పెండ్లాడి చేరి పురము
కైక వరంబుచే కానకు వే జొచ్చి
జానకీ చోరుని జగతి వెదకి
ఆంజనేయుని తోడ ఆ సాగరము దాటి
రావణు వధియించి రాజ్యమొసగి!

తే.గీ అతులితంబగు నానందమతిశయింప
సీతగొని అయోధ్యాపురము జేరి, నీవు
భక్తి మారుతి పాదముల్ పట్టుచుండ
రాజ్యమేలితివయ్య ఓ రామచంద్ర!

- వనం సుబ్రహ్మణ్యం
94415 94897

జీవనయోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

## ఉగాది ప్రతిభా పురస్కారాలు



పురస్కారాన్నందుకుంటున్న సీనియర్ జర్నలిస్ట్ దయాశంకర్

శుభకృత్ నామ ఉగాది సందర్భంగా ఈనెల 2న నెల్లూరులోని శ్రీ జీవన యోగశాల ఆరోగ్యసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న పలువురికి ఉగాది ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. నగరంలోని గాంధీబొమ్మ కూడలివద్ద ఉన్న స్వతంత్రపార్కు ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో తొలుత సురభి రాజశేఖర్ పంచాంగ శ్రవణం చేశారు. శ్రీ లలితా మహేశ్వరి ఆశ్రమం పీఠాధిపతి (ఇందుకూరు పేట) శ్రీ రామాయణం మహేష్‌స్వామి, ప్రముఖ గీతా ప్రబోధక్ షేక్ నజీర్‌బాషా గురూజీ విశిష్ట అతిథులుగా పాల్గొని ఉగాది విశిష్టతను తెలియజేసి అందరికీ శుభాకాంక్షలు చెప్పారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎం.వి ప్రసన్న కుమార్, యోగా గురువు రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నెరసం అధ్యక్షుడు జయప్రకాశ్, సయ్యద్ నజ్మా షమ్మి, గౌరి ముఖ్యఅతిథులుగా పాల్గొని పురస్కార గ్రహీతలను అభినందించారు. క్రీడా రంగంలో జాతీయస్థాయి క్రీడాకారులు పి.దయాల్‌దాస్, మంజుల (చెస్), షేక్ అబ్దుల్‌అజీజ్‌లకు, సామాజిక సేవారంగంలో పిజిడి కృపాల్, సంధ్య, పాత్రికేయ రంగంలో సీనియర్ జర్నలిస్టు దయాశంకర్‌లకు ఉగాది ప్రతిభా పురస్కారాలను అందజేశారు. అదేవిధంగా సాహితీరంగంలో మద్దూరు శ్రీనివాసులు, విద్యారంగంలో దేవదానం, డా.ఈశ్వరమ్మలతో పాటు ఆయా రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న రైల్వే ఎస్ఐ హరిచందన, కె.చంద్రఆచారి(జంతు సంక్షేమం), శాస్త్రీయనృత్యంలో కె.పావనిలకు శ్రీ రామాయణం మహేష్‌స్వామి చేతుల మీదుగా ఘనసన్మానాలు జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు లీన, సాదక్‌లు చేసిన అద్భుత యోగా విన్యాసాలు, పావని ప్రదర్శించిన ఫైర్‌రింగ్ డ్యాన్స్ అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశాయి. గౌతమబుద్ధా వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాయప్ప, రమేష్ పాల్గొన్నారు.

## జడ్పీ సిఇఓ బదిలీ

నెల్లూరు జడ్పీ సిఇఓగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ఈనెల 3న తిరుపతి జిల్లా డిఆర్ఓగా బదిలీఅయ్యారు. ఏపి పంచాయతిరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెంచలయ్య, రమేష్ బాబు తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు.

## డా. గంగిశెట్టికి సన్మానం



విజయనగరం జిల్లా పార్వతీపురం లయన్స్‌క్లబ్‌లో ఇటీవల జరిగిన మంచిపల్లి సత్యవతి స్మారక జాతీయ బాలసాహిత్య ఉగాది పురస్కార ప్రదానోత్సవాల కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన ప్రముఖ బాల సాహితీవేత్త డా.గంగిశెట్టి శివకుమార్‌కు ఘనసన్మానం జరిగింది. బాలసాహిత్య రంగంలో ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ నిర్వాహకులు ఆయన కృషిని అభినందించారు. బ్రహ్మశ్రీ వేమకోటి నరహరిశాస్త్రి, బెలగాం భీమేశ్వరరావు, గంటేడ గౌరునాయుడు, పివిబి శ్రీరామమూర్తి, సంస్థ కార్యదర్శి ఎం.పార్థసారథి, ఎం.గోపీనాథ్, కుదమ తిరుమలరావు, కిలపర్తి దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీక్షణం 48 - మంజీరెడ్డి

# మనిషి-మతం ఓ సంఘర్షణ

భరతమాత. మనదేశమాత. మన నేలతల్లి. ఈ తల్లి ఏ బిడ్డనూ తక్కువ చేయదు. ఏ దేశం నుంచి వచ్చినా చేరదీస్తుంది. తన ఒడిలో సేదదీరుస్తుంది. బయట నుంచి వచ్చిన వాళ్లు ఈ నేలను తమ పుట్టిల్లుగా భావించేటంతగా కలుపుకుపోతుంది ఈ దేశం. అలాంటి ఈ నేల మీద ఇక్కడి జీవనవిధానంలో కలవాలనుకునే వాళ్లు అలా మిళితమైపోయారు. తమ విశ్వాసా లను కొనసాగించుకుంటూ ఇక్కడి వారి విశ్వాసాలను గౌరవించే వాళ్లు కూడా చక్కగా పాలలో చక్కెరలా కలిసిపోయారు. మనుషులు అంతే... చక్కగా ఇమిడిపోతారు. అయితే... వ్యక్తులు కలిసిపోవాలనుకుంటూ ఉన్నప్పుడు వ్యవస్థలు విడదీయాలని చూస్తే... అప్పుడు ఘర్షణ మొదలవుతుంది. అదే ఇప్పుడు దేశంలో అనేక చోట్ల కనిపిస్తోంది.

### అందరిదీ ఇదే నియమావళి!

హిందూ ఆలయాల్లో హిందూయేతరులు ఏ క్రతువులనూ నిర్వహించరాదు... అనే నియమాన్ని అక్షరాలా పాటించే ప్రయత్నం జరుగుతోంది. ఇలాంటి నియమాలు ఇతర మతాల ధార్మిక సంస్థల్లో ఎప్పటి నుంచో అమల్లో ఉన్నాయి. ఆలయవేడుకల్లో భరతనాట్యం వంటి శాస్త్రీయ నాట్యాలు చేసే కళాకారిణుల విషయంలో ఈ మధ్య కేరళ చాలా స్పష్టంగా వ్యవహరించింది. ఈ విషయాన్ని జాతీయ మీడియా ప్రధానంగా ప్రచురించింది. హిందూమత వ్యతిరేక వార్తల విషయంలో కనిపించే పతాకస్థాయి సెక్యులరిజం కూడా వ్యక్తమైంది. కొంత దీర్ఘంగా ఆలోచిస్తే... అనేక ప్రశ్నలు తలెత్తుతాయి.

### దేవుడికి అందరూ ఒకటే

ఒకప్పుడు కాశీ విశ్వనాథుడి ఆలయంలో షెహనాయ్ వాద్యం ఎవరిది? ఉస్తాద్ బిస్మిల్లాఖాన్. కర్నాటక, హొసా మారిగుడి ఆలయంలో నాదస్వర కళాకారుడు ఎవరు? షేక్ జలీల్ సాహెబ్. మన తిరుమలలో సహస్రదళ పాద పద్మారాధనకు బంగారు పూలు సమర్పించిన భక్తుడు ముస్లిమ్. మన జిల్లా, బిట్రగుంటలో ఇటీవల జరిగిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తుల్లో ముస్లిమ్ మహిళలూ ఉన్నారు. ఉదయగిరి కోటలో జరిగే గంధం వేడుకల్లో హిందూ-ముస్లింలు పరస్పర సహానుభూతితో వేడుక చేసుకుంటారు. కావలి పట్టణ దేవత కలుగోళ శాంభవి మాత ఆలయం ఎదురుగా ఒక ఇల్లు, ఆ ఇంట్లో ముందు గదిలో ఆలయంలో పూజలకు అవసరమయ్యే వస్తువులమ్మే దుకాణం ఉండేది. కొబ్బరికాయలు, సాంబ్రాణి కడ్డీలు, కర్పూరం, పూలు వంటివన్నీ దొరికేవి. ఆ ముస్లిమ్ సోదరులకు అది ఉపాధి. వారి దగ్గర పూజాసామగ్రి కొనుక్కోవడానికి హిందూ భక్తులు ఏ మాత్రం ఇబ్బంది పడేవాళ్లు కాదు. హిందూ మత ధార్మిక క్రతువులకు సంబంధించిన పూజాద్రవ్యాల అమ్మకంతో పొట్టనింపుకోవడానికి ముస్లిమ్ మత పెద్దలు కూడా ఏ మాత్రం అభ్యంతరాలు చెప్పలేదప్పట్లో.

### నాట్య కళాకారిణులకు ఆంక్షలు

ఇప్పుడు వెలుగులోకి వస్తున్న వార్తలు ఏం చెబుతున్నాయి? ఈనెల 21వ తేదీన కేరళలోని కూడల్ మాణిక్యమ్ ఆలయం డాన్స్ ఫెస్టివల్‌లో భరతనాట్యం చేయడానికి గాను ముందుగా అనుకున్న కళాకారిణుల పేర్లను మార్చి 27న తొలగించడం వెనుక కారణాలు ఏమై ఉండవచ్చు. పదిరోజుల కిందట సౌమ్య సుకుమారన్ నాట్య ప్రదర్శన రద్దు చేస్తున్నట్లు కమిటీ ఆమెకు తెలియచేసింది. అంతకంటే ముందు అదే ఆలయంలో నాట్య ప్రదర్శన విషయంలో మాన్సియా అనే కళాకారిణికి కూడా అలాంటి సమాచారమే వచ్చింది. వీరిలో ఒకరు క్రిస్టియన్, మరొకరు ముస్లిమ్. ఆ ఆలయ కమిటీ వీళ్ల ప్రదర్శనను రద్దు చేయడం వెనుక కారణం క్రిస్టియానిటీ కాదు, ఇస్లాం కూడా కాదు. హిందూయేతరులు అనేది కారణం. ఈ సందర్భంగా ఈ కళాకారిణుల ఆవేదనలో మరికొన్ని వాస్తవాలు కూడా వెలుగుచూశాయి. హిందూ ఆలయాల్లో, హిందూ మత ధార్మిక పాటలకు నాట్యం చేయడం పట్ల సౌమ్యను చర్చ్ నిర్వాహకులు చాలా కాలం కిందటే నిలదీశారు. పైగా చర్చ్ క్రతువులలో పాల్గొనకుండా ఆంక్షలు కూడా విధించారామెకి. సౌమ్య సుకుమారన్‌కు ఎదురైన పరిస్థితులే మాన్సియాకు కూడా ఎదురయ్యాయి. ఆమె హిందూ ఆలయాల్లో నాట్యం చేయడం పట్ల ఇస్లాం మత పెద్దలు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకుంది.

### గత చేదు అనుభవాలు

ఎవాంజలిస్టులు హిందూ ఆలయాల్లో ప్రవేశించి హిందూ దేవతలను సాతానులుగా వర్ణిస్తూ... తమ మత ప్రచారం చేస్తున్న సంఘటనలు ఉన్నాయి. నిన్న మొన్నట్లో యూఎస్, న్యూయార్క్ స్క్వేర్‌లో ముస్లిమ్‌లు భారీసంఖ్యలో చేరి నమాజ్ చేశారు. ప్రతి మతమూ శాంతినే బోధిస్తుంది. కానీ 'మా మతం అత్యంత సౌమ్యమైనది' అని తెలియచెప్పే ప్రయత్నంలో పాల్పడే దురుసుతనమే అనేక ప్రశ్నలకు తావిస్తోంది.

### మనిషి కోసమే మతం

ఈ సందర్భంగా మరో కోణాన్ని కూడా అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం. నాట్యం విషయంలో ఆంక్షలు, నియమాలు పాటిస్తున్న కేరళ ఆలయాలు ఇంతకాలం హిందూయేతరులకు అవకాశం ఇచ్చాయనే విషయాన్ని మర్చిపోకూడదు. కేజే ఏసుదాసు పాడిన హిందూ భక్తిగీతాలను తన్మయత్వంలో ఆస్వాదించిన హిందువులను గుర్తు చేసుకోవాలి. అలాగే కేరళలో కొల్లామ్‌కు దగ్గరలో ఉన్న జగత్ జ్యోతి ఆలయంలో ఒక పెయింటింగ్ గురించి ఈ సందర్భంగా చెప్పుకోవాలి. అభయముద్రలో ధ్యానం చేసుకుంటున్న క్రీస్తు శిల్పం అది. బోధివృక్షం కింద ఉండే బుద్ధుడిని తలపిస్తూ ఉంటుంది. రిలిజియస్ ఎక్స్చేంజ్ ఇది. రోమన్ నుంచి వచ్చిన బిషప్ ఫ్రెడరిక్ ఆంటోనీ ఈ ఆలయంలో నేల మీద కూర్చుని భజనలో పాల్గొన్నాడు. భజన హిందువులకు మాత్రమే పరిమితమైన ధార్మిక కార్యక్రమం కాదు. అందరికీ వర్తిస్తుందని చెప్పాడు. ఇప్పుడు మనల్ని మనం ఓ ప్రశ్న వేసుకుందాం! మతం వ్యక్తుల మనుగడను సులభతరం చేయడానికా! లేక క్లిష్టతరం చేయడానికా? మనుషుల మనుగడ కోసం మతమా! లేక మతం మనుగడ కోసం మనుషుల జీవితాలను అంకితం చేయడమా!

## కొత్త వైద్యకళాశాలల
# ప్రతిపాదనల పరిస్థితేమిటి?..
### - పార్లమెంట్‌లో ఎంపీ విపిఆర్



దేశంలో 157 కొత్త వైద్యకళాశాలలను ఏర్పాటు చేసే ప్రతిపాదనలేమయ్యాయి?.. ఆ వివరాలు తెలపండంటూ ఎంపీ, 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 5న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖల మంత్రి డాక్టర్ భారతిప్రవీణ్‌కుమార్ సమాధానమిస్తూ ఇప్పటికే ఈ కళాశాలలకు సంబంధించి 71 పనిచేస్తున్నాయని, మిగిలిన 86 కళాశాలల ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని చెప్పారు. ఏపీలో పిడుగురాళ్ళ, పాడేరు, మచిలీపట్నంలలో వైద్య కళాశాలల ఏర్పాటు విషయమై ప్రతిపాదనలు ఆమోదించామని, ఏలూరు, మార్కాపురం, పులివెందుల, విజయనగరంలకు సంబంధించిన అంశాలు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అదేవిధంగా దేశంలో పలు థర్మల్‌కేంద్రాలు బొగ్గు కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని వేమిరెడ్డి పార్లమెంట్ దృష్టికి తీసుకువచ్చారు. కేంద్రమంత్రి ఆరికె సింగ్ అందుకు సంబంధించిన వివరాలను వేమిరెడ్డికి వివరించారు.

### సహకార రంగానికి కేంద్రం ప్రోత్సాహకాలేమిటి?

రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం సహాయం చేస్తున్న తీరు, ప్రత్యేకించి ఏపి సహకారోద్యమాన్ని బలోపేతం చేయడానికి, ముఖ్యంగా పాడిపరిశ్రమ, చక్కెర పరిశ్రమ, సహకార రంగాలకు సహాయం చేస్తున్న రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు ఏమిటని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 6న రాజ్యసభలో ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి అమిత్‌షా మాట్లాడుతూ సహకార మంత్రిత్వశాఖ వ్యవసాయ సహకారానికి సెంట్రల్ సెక్టార్ ఇంటిగ్రేటెడ్ స్కీమ్‌ను అమలుచేస్తోందన్నారు. జాతీయ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో సహ దేశవ్యాప్తంగా సహకార రంగం అభివృద్ధి కోసం పాడి, చక్కెర రంగంతో సహ ఆర్థిక సహాయాన్ని సబ్సిడీ రూపంలో అందజేస్తున్నామన్నారు. ఈ పథకం కింద సాధారణంగా రాష్ట్రాలకు ప్రతిఏటా సబ్సిడీ మంజూరుచేస్తారని, డెయిరీ అభివృద్ధికి సంబంధించి విడుదల చేసిన సబ్సిడీ వివరాలను ఆయన సంవత్సరాల వారీగా తెలియజేశారు. అంతేకాకుండా 2022-23 ఆర్థిక సంవత్సరానికి సహకార మంత్రిత్వశాఖ కొత్త పథకాలను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటోందని, వీటిలో పిఏసిఎస్‌లో డిజిటలైజేషన్, సహకార విద్య, శిక్షణ, 'సహకార్ సే సమృద్ధి' వంటి పథకాలు ఉన్నాయని ఆయన వేమిరెడ్డికి వివరించారు.

# కందుకూరు కూడా కళకళలాడాలి
### అధికారులతో కలెక్టర్

జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతనంగా నెల్లూరుజిల్లాలో కలిసిన కందుకూరు డివిజన్‌లో అభివృద్ధిపనులను జిల్లా కలెక్టర్ తొలిసారిగా కందుకూరుకు వెళ్ళి సమీక్షించారు. కందుకూరులోని ఆర్డీఓ కార్యాలయంలో ఈనెల 6న అధికారులతో సమావేశమై చర్చించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ చేరువ కావాలని, ముఖ్యంగా పేదలకు ఇళ్ళు, ఓటిఎస్ అమలు తదితర అంశాలపై ఆయన స్పష్టమైన ఆదేశాలిచ్చారు. పథకాల అమలును వేగవంతం చేయాలని, కందుకూరు డివిజన్ మంచి పురోగతి సాధించాలని చెప్పారు. కందుకూరు నియోజకవర్గంలోని రాళ్లపాడు రిజర్వాయరుకు సోమశిల నుంచి రావాల్సిన 15 టిఎంసిల నీటిని సకాలంలో అందేలాచేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఆయన రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని పరిశీలించారు. గుడ్లూరు మండలంలోని సాలిపేట పంచాయతీలో పోర్టు నిర్మాణం కోసం ఖాళీ చేయాల్సివస్తున్న కర్లపాలెం, ఆవులవారిపాలెం, మొండివారిపాలెం గ్రామాలను పరిశీలించి స్థానికులతో చర్చించారు. తెట్టు రైల్వేస్టేషన్ వద్ద నుంచి పోర్టు దాకా నిర్మాణం జరగాల్సిన రైల్వే పనుల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జేసీ హరేందిరప్రసాద్, ట్రైనీ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్‌ఖాన్, కందుకూరు ఆర్డీఓ ఉమాదేవి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి హనుమాన్‌ప్రసాద్, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ పాలనలోనూ.. పలు మార్పులు

కొత్త జిల్లాలు ఏర్పాటు కావడంతో అందుకు తగ్గట్టుగా కలెక్టరేట్‌లోనూ పలు మార్పులు అనివార్యమయ్యాయి. పాలనా పరంగా ఇబ్బందులు రాకుండా ఆ మార్పులు జరుగుతున్నాయి. కలెక్టరేట్‌లో ఉన్న పలు విభాగాలను విలీనంచేయడం కూడా జరిగింది. ఉద్యోగులను కూడా ఆయా సెక్షన్లకు అవసరమైన రీతిలో నియమించారు. కలెక్టరేట్‌లోని ఏ-సక్షన్, బి-సెక్షన్ సూపరింటెండెంట్‌గా పి. సుబ్రహ్మణ్యం, డి-సెక్షన్, హెచ్-సెక్షన్ల సూపరింటెండెంట్‌గా గోర్ల వెంకటేశ్వర్లు, సి-సెక్షన్ సూపరింటెండెంట్‌గా హేమాద్రిరాజు, ఇ-సెక్షన్ సూపరింటెండెంట్‌గా వెంకటసునీల్, ఎఫ్-సెక్షన్ సూపరింటెండెంట్‌గా శాంత కుమారి, జి-సెక్షన్ సూపరింటెండెంట్‌గా విజయకుమార్‌లు నియమితులయ్యారు. ఇప్పటివరకు ఉన్న కోనేరు రంగారావు సిఫార్సు కమిటీ డెప్యూటి కలెక్టర్ పోస్టును రద్దు చేశారు. భూముల విషయాల విభాగానికి ఇప్పుడున్న సిబ్బందిని కొంత తగ్గించారు.

## కొత్త డిఆర్‌ఓగా..
# నారాయణమ్మ




జిల్లా రెవెన్యూ అధికారిగా సి.వెంకట నారాయణమ్మ నియమితులయ్యారు. ఈ నెల 6న కలెక్టరేట్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు ఏపిఐఐసి జోనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆమె నెల్లూరుకు డిఆర్‌ఓగా బదిలీ అయి వచ్చారు. గతంలో ఆమె నెల్లూరుజిల్లాలోని పలు మండలాల్లో తహశీల్దార్ గా పనిచేసిన అనుభవం కూడా ఉండడంతో ఆమె ఈ జిల్లాకు బాగా సుపరిచితులే. తొలుత ఆమె జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీ హరేందిరప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. డిఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించి, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. కొత్త డిఆర్‌ఓకు..'లాయర్' శుభాకాంక్షలు!

## కలెక్టరేట్ ఏ.ఓగా
# మళ్ళీ.. సుబ్రహ్మణ్యమే

జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారి (ఏ.ఓ)గా మంచిపేరున్న పసుపులేటి సుబ్రహ్మణ్యాన్నే మళ్ళీ ఏ.ఓగా నియమించారు. ఇటవలి వరకు ఏ.ఓగా ఉన్న సుబ్రహ్మణ్యం జిల్లాల పునర్విభజన నేపథ్యంలో తిరుపతి జిల్లాకు బదిలీఅయ్యారు. అయితే, విధి నిర్వహణలో క్రమశిక్షణాయుతంగా పనిచేస్తారని పేరున్న సుబ్రహ్మణ్యాన్నే నెల్లూరు కలెక్టరేట్‌లో ఏ.ఓగా నియమిస్తూ తాజాగా ఈనెల 6న జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ఉత్తర్వులు జారీచేశారు. ప్రత్యేకించి కలెక్టరేట్‌లోని ఏ-బి సెక్షన్లను ఆయన పర్యవేక్షిస్తారు కూడా.

## పుట్టినరోజు శుభాకాంక్షలు



పెన్నా సిమెంట్స్ చైర్మన్ పుట్టంరెడ్డి ప్రతాప్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్న పెన్నా సిమెంట్స్ సమాచార ప్రజా సంబంధాల అధికారి వైఎల్ దీపక్‌రెడ్డి.

# బిజెపితోనే దేశాభివృద్ధి
### - పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు



భారతీయ జనతా పార్టీ (బిజెపి)తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, కాంగ్రెస్ పార్టీ పాలనలో దేశం ఎలాంటి ప్రగతికి నోచుకోలేదని, బిజెపి అధికారంలోకి వచ్చాకనే కొత్త సంస్కరణలతో దేశం ఎంతో పురోగతి సాధిస్తోందని బిజెపి నాయకులు అన్నారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 6న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జిల్లా బిజెపి ఇన్‌చార్జి రఘురామిరెడ్డితో పాటు నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, మెగరాల రాజేష్, గడ్డం విజయకుమార్, రోశయ్య తదితరులు పాల్గొని బిజెపి జెండాను ఆవిష్కరించారు. బిజెపి ఆవిర్భావం నుంచి జరుగుతున్న పరిణామాలను, ప్రధాన మోడీ సారథ్యంలో దేశం ఎంతో గొప్పగా పురోగమిస్తున్న తీరును వివరించారు. అనంతరం మినీ బైపాస్‌రోడ్డులో సద్భావనయాత్ర నిర్వహించారు.





లాయర్
ఏప్రిల్ 08, 2022

# రైతు కష్టం.. దళారుల పాలు

మనదేశంలో రైతుల కష్టాలు ఎంత చెప్పినా తరగవు. ఎంత కష్టపడి పంటలు పండించినా గిట్టుబాటు ధరలు ఉండడం లేదు. వారి కష్టమంతా దళారుల పాలవుతోంది. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పలు పథకాలు అమలుచేస్తూనే ఉన్నా అవి ఏమాత్రం చాలడం లేదు. రైతులకిచ్చే రాయితీలకు బడ్జెట్ కేటాయింపులు గతంలో కంటే తగ్గిపోయాయి. మరోవైపు నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయాయి. ఈ పరిస్థితులన్నిటినీ ప్రభుత్వం మరోసారి సమీక్షించాలి. రైతు బాగుంటేనే సేద్యం బాగుంటుంది. సేద్యం బాగుంటేనే దేశం బాగుంటుంది. ప్రభుత్వాలు ఆ దిశగా వ్యవసాయాన్ని బాగా ప్రోత్సహించి అన్నదాతలను అన్నివిధాలా ఆదుకోవాలి.

దేశానికి వెన్నెముక రైతేనన్నది.. మనదేశంలో ఒక పెద్ద నినాదం. వాస్తవానికి అన్నదాతే దేశానికి వెన్నెముక అన్నది తిరుగులేని వాస్తవం. అయితే, ఆ అన్నదాతల పరిస్థితి మాత్రం మనదేశంలో రానురాను దయనీయంగా తయారవుతుండడమే విచారకరం. ఇటీవలి కాలంలో ఒకవైపు కరోనా సంక్షోభంతో పాటు మరోవైపు ప్రకృతి విపత్తులు, ఇంకోవైపు మార్కెట్లలో తిప్పలు అన్నీ కలసి వెరసి అన్నదాతకు కన్నీళ్ళే మిగిలిస్తున్నాయి. రైతుల రెక్కల కష్టమంతా దళారులకే హారతికర్పూరమైపోతోంది. చేసిన సేద్యమంతా అప్పులకే నైవేద్యమైపోతోంది. దీంతో అత్యధికశాతం మంది రైతుల జీవనం అంధకారంలోనే ఉంటోంది. ఎంతోమంది ఈ అవస్థలతో బతకలేక ఆత్మహత్యలకు కూడా పాల్పడుతుండడం ఎంతో బాధాకరం. 2018 నుంచి 2020 దాకా..ఈ మూడేళ్ళ కాలంలోనే దాదాపు 17వేల మందికి పైగానే అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడినట్లు కేంద్ర గణాంకాలే చెప్తున్నాయంటే దేశంలో రైతుల జీవనపరిస్థితులు ఎంత దయనీయంగా ఉన్నాయో ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. పంటలు పండించుకునేందుకు చేసిన అప్పులు, వాటి తాలూకు వడ్డీలు పెరిగిపోయి, అసలు కంటే కొసరు భారమై చివరికి జీవితమే పెనుభారమైపోయే దుస్థితి. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా.. ఏళ్ళ తరబడి కాదు.. తరాల తరబడిగా రైతుల జీవితాల్లో పెద్దగా మార్పులేమీ ఉండడం లేదు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పలు పథకాలు అమలుచేస్తూనే ఉన్నా అవి ఏమూలకూ చాలడం లేదు. బీదాబిక్కీ రైతుల సమస్యలకు సరైన పరిష్కారాలే లభించడం లేదు. ఆరుగాలం కష్టించినా పంటకు తగ్గ గిట్టుబాటుధరలు ఇవ్వడం లేదు. వ్యాపారులు, దళారుల మాయల వలలో చిక్కిపోవడం తప్ప రైతుకు మరో మార్గాంతరం కనిపించడం లేదు. మార్కెట్లలో పంటలకు మంచి ధరలు వచ్చేదాకా భద్రపరచుకునేందుకు తగ్గ గిడ్డంగులు ఉండవు. ఈలోగా ఆ ఉత్పత్తులు ఎక్కడ పాడైపోతాయోనని దళారులు ఇచ్చిన ధరకే తెగనమ్ముకునే పరిస్థితి. ఇదే అదనుగా ప్రతిచోటా..ప్రతి దశలోనూ చిన్న సన్నకారు రైతులను దళారులు, బడా వ్యాపారులు సిండికేట్లుగా మారి జలగల్లా పీల్చుకు తింటూనే ఉన్నారు. ఇదిలా ఉంటే ప్రకృతి కూడా ఒక్కోసారి రైతన్నలపై పగబట్టినట్లుగా.. అకాల వర్షాలో, కరువు కాటకాలో వచ్చి పడుతుంటాయి. పంటలు పండాల్సిన సమయంలో సాగునీరు దొరకదు. వర్షం మీద ఆధారపడి సాగుచేసుకునే పంటలు వర్షాలు రాకుంటే ఎండిపోక తప్పదు. వ్యవసాయం జూదం లాంటిదన్న మాట ఎంత యధార్థమో అనిపిస్తుంటుంది. వ్యవసాయాన్ని నమ్ముకుని శ్రమిస్తూ దేశానికి నాలుగు మెతుకులు పెడుతున్న అన్నదాతలకు చివరికి తినేందుకు, వారి బిడ్డలు చదువుకునేందుకు, కుటుంబాలు ఏ లోటూ లేకుండా బతికేందుకు కూడా నోచుకోవడం లేదన్నది అందరికీ తెలిసిన సత్యమే. అయినా ఎంతకాలమిలా?.. ఈ పరిస్థితులు ఇకనైనా మారాలి. రైతుల జీవితాల్లో సంతోషం వెల్లివిరియాలి. ఆధునిక పరిజ్ఞానం అన్ని రంగాల్లో శరవేగంగా విస్తరిస్తున్న నేటి అధునాతన కాలంలో ఆధునిక వ్యవసాయాన్ని రైతులకు అందుబాటులోకి తేవాలి. వ్యవసాయరంగంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తామని ప్రభుత్వాలు ప్రతి ఏటా వాగ్దానాలు చేస్తూనే ఉన్నా ఆచరణలోకి వచ్చేసరికి అంతంత మాత్రమే. కేంద్రం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో ఒక్క రాయితీల విషయమే కాదు, ఎన్నో ఆశలు పెట్టుకున్న పలు రకాల పథకాలకు కూడా ఈసారి కేటాయింపులు తగ్గిపోవడం రైతులను నిరాశకు గురిచేస్తోంది. రైతుల సంక్షేమం కోసం రూపొందించిన డా.స్వామినాథన్ ప్రతిపాదనలు ఎప్పుడో అటకెక్కిపోయాయి. ఈ పరిస్థితులన్నిటినీ కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు మరోసారి సమగ్రంగా సమీక్షించాలి. రైతులను ఆదుకునేందుకు, వ్యవసాయాన్ని ఫలసాయం చేసేందుకు సరైన పథకాలు.. ప్రణాళికలను చిత్తశుద్ధితో అమలుచేయాలి. అడుగడుగునా ఉన్న దళారుల ప్రమేయాలను అరికట్టి మార్కెట్లలో రైతులకు గిట్టుబాటుధరలు వచ్చేలా చేయాలి. రైతాంగానికి అవసరమైన అన్నిరకాల రాయితీలను, అభివృద్ధి పథకాలను చేరువ చేయాలి. పంటరుణాలను ఉదారంగా ఇచ్చి ప్రోత్సహించాలి. అన్ని రకాల పంటలకు ప్రభుత్వాలే మద్దతు ధర ఇవ్వాలి. ఏదేమైనా రైతు బాగుంటేనే సేద్యం బాగుంటుంది. సేద్యం బాగుంటేనే దేశం బాగుంటుంది. ప్రభుత్వాలు ఆ దిశగా వ్యవసాయాన్ని అన్నివిధాలా ప్రోత్సహించి అన్నదాతలను ఆదుకోవాలి.

## ప్రమాదకరమైన ట్రాన్స్‌ఫార్మర్లు



నెల్లూరు నగరంలో చాలాచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్లపైనా, అపార్టుమెంట్ల బయటా భారీసైజు కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి అలాగే వదిలేసి ఉన్నారు. చాలావరకు వాటికి కంచె లేదు. ప్రమాదవశాత్తు ఎవరైనా తగిలితే.. అంతే సంగతులు, మాడి మసైపోతారు. కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసే

## సమస్యల తో 'రణం'

టప్పుడు కానీ లేదా, ఎక్కడైనా అవి ప్రమాదకరంగా ఉన్నాయని గుర్తించినప్పుడు కానీ వాటికి చుట్టూ కంచె ఏర్పాటుచేసి 'DANGER/ అపాయము' వంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ ప్రస్తుతం నగరంలో అలాంటివి అరుదుగా కనిపిస్తున్నాయి. ఈ విషయంలో సంబంధిత శాఖ అధికారితో మాట్లాడితే 'సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు అయిదున్నర అడుగుల నుండి ఆరు అడుగుల ఎత్తులో ఉండాలని, చాలాచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టిన తరువాత రోడ్లు ఎత్తు లేపడంవల్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయని వివరణ ఇచ్చారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయని భావిస్తే ఆ చుట్టుపక్కల నివాసం ఉన్నవారు సదరు విషయాన్ని తమ శాఖ దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకువస్తే తక్షణమే కంచె ఏర్పాటుచేసే అవకాశం ఉందని చెప్పారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఉన్నాయని భావిస్తే... ఆయా ప్రాంతాల ప్రజలు స్పందించగలరు.

\- సంచారి

## రాష్ట్రంలో.. నెల్లూరే పెద్ద జిల్లా

నాలుగు రెవిన్యూ డివిజన్లు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, 38 మండలాలతో రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా ప్రత్యేకమైన గుర్తింపుతో జిల్లా ఏర్పడిందని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుండి జిల్లాల పునర్వ్యవస్థీకరణ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే పరిపాలనా వికేంద్రీకరణకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నూతన జిల్లాల ఏర్పాటు ప్రక్రియ చేపట్టారన్నారు. 26 జిల్లాలుగా రాష్ట్రం ఏర్పడిందని, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా 38 మండలాలతో అతిపెద్ద జిల్లాగా అవతరించిందని చెప్పారు. దాదాపు 25 లక్షల జనాభాతో ఒక గౌరవప్రదమైన స్థానం జిల్లాకు దక్కిందన్నారు. కృష్ణపట్నం, రామాయపట్నం రెండు ఓడరేవుల ప్రాంతాలతో తీర ప్రాంతాల్లో ఆర్థిక అభివృద్ధికి వీలుంటుందని, ముఖ్యంగా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం కావడానికి పూర్తిస్థాయిలో తాగునీరు, సాగునీరు అందించడానికి సోమశిల, కండలేరు జలాశయాలు జిల్లాలోనే ఉంటూ మొత్తం ప్రాంతం అభివృద్ధి చెందడానికి అవకాశం లభించిందన్నారు. తీరప్రాంత జిల్లాల్లోనే కాకుండా ఇరవై ఆరు జిల్లాల్లో నెల్లూరుజిల్లా అభివృద్ధిలో అగ్రగామిగా ఉండడానికి జిల్లాకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లా మరింత వేగవంతంగా అభివృద్ధి వైపు దూసుకెళ్లే విధంగా పని చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు పునరంకితమవుతామంటూ ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి రవాణా సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పేర్ని నాని, చీఫ్ సెక్రటరీ డాక్టర్ సమీర్‌శర్మ, సీసీఎల్‌ఏ స్పెషల్ సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయశాఖస్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, ఆర్అండ్‌బి ముఖ్యకార్యదర్శి ఎం.టి కృష్ణబాబు, ప్రణాళిక శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొనగా జిల్లా నుంచి జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు, సంయుక్త కలెక్టర్ హరేందిర ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

## నెగటివ్ అంశాలతో పోలిక అవసరమా...




ఇటీవల అధికారపార్టీ నాయకుల పోకడ వింతగా ఉంటోంది. వైసీపీ ప్రభుత్వం ఏదైనా ఒక విధాన నిర్ణయం చేసినప్పుడు ప్రతిపక్షాలు విమర్శించడం సహజం. ఆ విమర్శలను సమర్థవంతంగా తిప్పి కొట్టవలసిన బాధ్యత అధికార పక్షానిది. అప్పుడు మీరిలా చెయ్యలేదా..? అంటూ గత ప్రభుత్వ నిర్ణయాలతో పోల్చుకుని వారి విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉదాహరణకు ఇటీవల సామాన్యుడిపై పడిన కరెంటు బిల్లుల పిడుగు వ్యవహారంలో అధికారపక్ష నాయకుల తీరు విడ్డురంగా ఉంది. తమ ప్రభుత్వం బిల్లులు పెంచడానికి గల కారణాలు, పరిస్థితులు, పెరిగిన శాతం వంటి అంశాలను సమగ్రంగా వివరించాలి. ఆలాకాకుండా మీరు అధికారంలో ఉన్నపుడు పెంచలేదా..? ప్రజలపై భారం పడలేదా..?? అంటూ ఎదురు ప్రశ్నించడం విచిత్రంగా ఉంది. గత ప్రభుత్వం ఆలాచేసింది కాబట్టే కదా ప్రజలు కొత్త పార్టీని ఎన్నుకున్నారు. వైసీపీకి పట్టం కట్టారు. అప్పుడు వాళ్ళు కూడా పెంచారు, ఇప్పుడు మేం పెంచుతున్నాం అని బదులివ్వడం అపరిపక్వతే అవుతుంది. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పారిశ్రామిక ప్రగతి, మౌళిక వసతుల కల్పన, విద్య, వైద్యం తదితర అంశాలలో గత ప్రభుత్వం వాళ్ళ కంటే మేం ఘనంగా చేశాం అని చెప్పుకోవాలి. అంతే కానీ, అప్పుడు వాళ్ళు అంత పెంచితే మేం ఇంత పెంచాం, అప్పుడు 90 నేరాలు జరిగితే ఇప్పుడు 80 నేరాలు జరిగాయి, అప్పుడు ఆలా అయితే ఇప్పుడు ఇలా అంటూ నెగటివ్ అంశాలతో జగన్‌మోహన్‌రెడ్డిని బాబు పాలనతో పోల్చి మాట్లాడడం హాస్యాస్పదంగాఉంది. పార్టీ పెద్దలూ, నాయకులూ ఈ విషయంలో తమ వైఖరి మార్చుకుని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన మంచి పనుల విషయంలో గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే బాగుంటుంది.

కే.పీ. చంద్రకుమార్, ఒంగోలు.

## నడ్డి విరిచేది మధ్యతరగతి వారినేనా?

రాష్ట్రంలో ఒక ప్రభుత్వం ఏర్పడడంలో కీలకపాత్ర పోషించేది మధ్యతరగతి ప్రజలే!. కానీ ఏ ప్రభుత్వం కూడా వారిని పట్టించుకోదు. రాయితీలన్నీ కూడా దిగువ మధ్యతరగతి వారికో, లేక ధనవంతులకో ఇస్తుంటాయి. మధ్యతరగతి వారిలో అగ్రవర్ణాల వారు కూడా ఎక్కువగానే ఉన్నారు. వాళ్ళకు ప్రభుత్వ పథకాలు కూడా వర్తించవు. ఏ విధంగా చూసినా ఈ ప్రభుత్వాలు మధ్యతరగతి వాళ్ళ నడ్డి విరిచి పేద, ధనికులకు పెడుతున్నాయి. ఇప్పుడు కరెంటు బిల్లు పెంపు ఛార్జీలలో ఆ తేడా స్పష్టంగా కనపడుతోంది. పెరిగిన రేట్లను పరిశీలిస్తే.. 30 యూనిట్ల వరకు 45 పైసలు, 31-75 వరకు 91 పైసలు, 76-125 వరకు రూ.1.40, 126-225 వరకు రూ.1.57, 226-400 వరకు రూ.1.16, 400కు పైన 55 పైసలు పెంచుతున్నట్లు వార్తల్లో చూశాను. దీనిని బట్టి మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వారిని బాదుతున్నారని స్పష్టంగా చెప్పగలం. సామాన్యంగా మధ్యతరగతి వారికి, ఎగువ మధ్యతరగతి వారికి 120 నుండి 300 యూనిట్లు అవసరముంటుంది. ఆంధ్రప్రదేశ్ జనాభాలో దిగువ మధ్యతరగతి వారు, ధనికులు 25 శాతం ఉంటారేమో? ప్రభుత్వాలు వారికి ఇచ్చిన విలువ, రాయితీలు 75శాతం ఉన్న మధ్యతరగతి ప్రజలకు ఇవ్వడం లేదు. మధ్యతరగతి వారు జీతాలు పెరిగాయని ఆనందపడేలోపే ఇలా రేట్లు పెంచి వారి ఆనందానికి తూట్లు పొడుస్తున్నాయి. అందుకేనేమో మధ్యతరగతి వారు ఎప్పటికీ మధ్యతరగతి వారిగానే మిగిలిపోతున్నారు.


జె.ఎస్.కృష్ణ, నెల్లూరు.

## కళాకారుల కష్టాలు కళ్ళకు కట్టారు..!

ఇటీవల మన 'లాయర్'లో 'కరోనాతో కళారంగం కకావికలం' అంటూ రాసిన వార్త నిజంగా కళారంగం పడుతున్న కష్టాలను కళ్ళకు కట్టింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక కళాకారులకు పూర్తిగా గుర్తింపు కరువైపోయింది. మీరు రాసినట్లుగా కళాకారుడు స్థాపించిన పార్టీగా తెలుగుదేశంపార్టీకి కళలు, కళాకారుల విలువ బాగా తెలుసు. వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల వారికి తాయిలాలు అందిస్తూ కళలే ఆధారంగా జీవనం సాగించే కళాకారులను పట్టించుకోకపోవడం అన్యాయం. తమ వృత్తి ద్వారా ప్రజలకు వినోదాన్ని అందిస్తూ సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను తమ ప్రదర్శనలద్వారా చూపిస్తూ ప్రజలని చైతన్యవంతుల్ని చేయడంలో కీలకపాత్ర పోషించేది కళాకారులే. వారికి కళలే దైవం, కళలే ఆధారం, కళలే వారి జీవితం. ఆయా జిల్లాలలోని స్థానిక నేతలైనా కళాకారుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి వారికి జీవనోపాధి కల్పించడంతో పాటు కళారంగానికి పూర్వ వైభవం తీసుకురావాలని కోరుతున్నాను.

యం. బెనర్జీ, నెల్లూరు.

# వైద్య కళాశాలలకు రుణం మంజూరు ఏమైంది?



## - పార్లమెంట్‌లో నెల్లూరు ఎంపీ ఆదాల

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల పునరుద్ధరణ, బలోపేతం కోసం అడిగిన 7500 కోట్ల రూపాయల రుణ ప్రతిపాదన ఏమైందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల పార్లమెంట్‌లో ప్రశ్నించారు. అందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ సమాధానం చెప్తూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాలల, సంస్థల ఉన్నతికి ఒక పథకాన్ని నిర్వహిస్తోందని, ప్రధానమంత్రి సురక్ష యోజన పథకం కింద సూపర్ స్పెషాలిటీ బ్లాక్, లేదా ట్రామా సెంటర్, ఇతర సౌకర్యాల ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న వైద్య కళాశాలలో ఎం.బి.బి.ఎస్, పీజీ సీట్లను పెంచడం ద్వారా మరో రెండు కేంద్ర ప్రాయోజిత పథకాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల పునరుద్ధరణ లేదా బలోపేతం కోసం ఆ మంత్రిత్వ శాఖ ఏ పథకాల కింద కూడా రుణం మంజూరుచేసే నిబంధన లేదని స్పష్టం చేశారు.

## పులుల మరణాలను తగ్గించేందుకు ఏం చర్యలు తీసుకున్నారు?

పులుల మరణాలు నానాటికీ పెరుగుతున్న తరుణంలో ఆ మరణాల నివారణకు కేంద్రప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందని నెల్లూరు ఎంపీ ఆదాల సోమవారం లోక్‌సభలో ప్రశ్నించారు. అందుకు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి అశ్వని కుమార్ చౌబే రాతపూర్వకంగా సమాధానమిస్తూ 2019 నుంచి 2021 వరకు ఆంధ్రప్రదేశ్‌లో 3 పులులు మరణించాయని, దేశంలో మొత్తంగా 329 పులులు ప్రాణాలు కోల్పోయాయని తెలిపారు. ఇప్పుడు పులుల సగటు ఆయువు 10 నుంచి 12 సంవత్సరాలని, ఇవి వృద్ధాప్యం, వ్యాధులు, అంతర్గత తగాదాలు, అధిక శిశుమరణాలు, విద్యుత్‌ఘాతం, ఉచ్చులు, మునిగిపోవడం, రోడ్డు, రైలు ప్రమాదాల వల్ల దెబ్బలు మొదలైన అనేక అంశాలు పులుల మరణాల్లో ఉంటాయని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే పులుల మరణాలు తగ్గాయని తెలిపారు. పులుల సంరక్షణకు భద్రతా ప్రణాళికను రూపొందించి, అమలు చేస్తున్నట్లు, పులుల మరణాలను అరికట్టేందుకు గాను అవగాహన కార్యక్రమాలు, ప్రచారం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందుకుగాను నిధులను కూడా కేటాయించినట్లు తెలిపారు.

## సేంద్రీయ వ్యవసాయానికి.. కేంద్రం ప్రణాళికలు ఏమిటి?..

ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా నెల్లూరుజిల్లాలో సేంద్రీయ వ్యవసాయం అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటోందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 5న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. అందుకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ రాతపూర్వకంగా జవాబిస్తూ ఏపీతో పాటు దేశంలో సేంద్రీయ వ్యవసాయాన్ని క్లస్టర్ పద్ధతిలో ప్రోత్సహించేందుకు పరంపరాగత్ కృషి వికాస్ యోజన పథకం ద్వారా కృషి జరుగుతోందన్నారు. సేంద్రీయ రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా కలుగజేస్తున్నామని, ఏడాదికి 50వేల రూపాయల వంతున మూడేళ్లపాటు ఆర్థికసాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో గత అయిదేళ్ళలో 86,085 మంది రైతులు 33,466 హెక్టార్లలో సేంద్రియ ఉత్పత్తులను సాగుచేశారని, వారికి ఈ పథకాలు వర్తించాయని పేర్కొన్నారు.

# కందుకూరు అభివృద్ధికి.. ఎంపీ ఆదాల చేయూత



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు నియోజక వర్గంలోని కందుకూరు మున్సిపాలిటీలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎంపీ నిధుల ద్వారా కొనుగోలు చేసిన జెసిబి, ట్రాక్టర్, దోమల నివారణ ఫాగింగ్‌మిషన్‌లను కందుకూరు శాసనసభ్యుడు, మాజీమంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి ఈనెల 6న ప్రారంభించారు. ఢిల్లీలోని పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న నెల్లూరు ఎంపీ ఆదాల ఆదేశాలతో మహీధర్‌రెడ్డి కందుకూరు మున్సిపాలిటీకి రూ. 50లక్షలు విలువ చేసే జెసిబి, ట్రాక్టర్, దోమల నివారణ పాగింగ్ మిషన్‌లను ప్రారంభించారు. కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి అభినందించారు.

# సెబ్ జేడీగా..శ్రీలక్ష్మి కొనసాగింపు



స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) జాయింట్ డైరెక్టర్‌గా కె.శ్రీలక్ష్మిని కొనసాగిస్తూ ఆ శాఖ కమిషనర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. 2020 నవంబరు 24న ఆమె సెబ్ జేడీగా నెల్లూరులో బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ లక్ష్యా లకు అనుగుణంగా జిల్లాలో మద్యం అక్రమరవాణా, అనధికార విక్రయాలు, నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గంజాయి, పొరుగు మద్యం, ఎర్రచందనం అక్రమ రవాణా, నాటుసారా తయారీ వంటి అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి అంతర్‌రాష్ట్ర నేరగాళ్ళను సైతం పట్టుకున్నారు. అనేక అక్రమాలను ఆరా తీసి కేసుల చేధనలో తన ప్రతిభ చూపుతూ సెబ్ శాఖకు వన్నె తెస్తున్నారు. 'సెబ్' ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసి జిల్లాలో ఎన్నో అరాచకాలను అరికట్టారు. అనేక అక్రమాలకు అడ్డుకట్ట వేశారు. ఇటీవలే గోవా రాష్ట్రానికి చెందిన మద్యాన్ని పెద్దఎత్తున తెచ్చి విక్రయిస్తున్న పలువురు నిందితులను కూడా అరెస్ట్‌చేసి పెద్దసంఖ్యలో మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో సెబ్ జేడీగా అంకితభావంతో క్రమశిక్షణాయుతంగా పనిచేస్తున్న శ్రీలక్ష్మినే ప్రభుత్వం కొనసాగించడానికి నిర్ణయం తీసుకోవడం పట్ల సెబ్ వర్గాల్లో సంతోషం

# ఢిల్లీలో... తాతయ్య ఇంట.. కొత్త జంట

భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు – శ్రీమతి ఉషమ్మల మనుమరాలు, యిమ్మణ్ణి వెంకట్‌రావు – దీపల కుమార్తె సుష్మ – కిషన్‌ల పరిణయం ఫిబ్రవరిలో జరిగింది. మార్చి చివరి వారంలో ఈ కొత్త దంపతులు ఢిల్లీలోని తాతయ్య ఇంట సందడి చేశారు. భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రధానమంత్రి మోడీ స్వయంగా ఉపరాష్ట్రపతి భవనానికి వచ్చి సుష్మ–కిషన్‌లను ఆశీర్వదించారు. ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఆత్మీయ కార్యక్రమంలో పలువురు కేంద్రమంత్రులు, రాజకీయ ప్రముఖులు, ఇతర పెద్దలు కొత్త జంటను దీవించారు.


1


2


3


4

1. రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులను కలసి దీవెనెలు తీసుకున్న సుష్మ-కిషన్‌లు. వీరితో పాటు ఇరు కుటుంబాల సభ్యులు రాష్ట్రపతిని కలుసుకున్నారు.
2. ఉపరాష్ట్రపతి భవన్‌లో నవదంపతులను ఆశీర్వదించిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.
3. ఉపరాష్ట్రపతి నివాసంలో జరిగిన ఆత్మీయ కార్యక్రమంలో కొత్త దంపతులతో పాటు పాల్గొన్న కేంద్ర మంత్రులు, ప్రముఖులు.
4. దీపమ్మ కుమారుడు విష్ణువర్ధన్‌ని ప్రత్యేకంగా అభినందిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ.

# అభినందన శుభాకాంక్షలు



మరో రెండు నెలల కాలంలో తమ రాజ్యసభ సభ్యత్వానికి గడువు ముగుస్తున్న సభ్యులకు ఇటీవల ఉపరాష్ట్రపతి భవన్‌లో భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మెన్ ముప్పవరపు వెంకయ్యనాయుడు వీడ్కోలు విందు ఇచ్చారు. ఆ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల ఇన్‌ఛార్జ్ వేణుంబాక విజయసాయిరెడ్డికి జ్ఞాపికను, చిత్రపటాన్ని బహుకరించి అభినందిస్తున్న వెంకయ్య మరియు రాజ్యసభ డెప్యూటి ఛైర్మెన్ హరివన్ష్ నారాయణ్‌సింగ్.



# టౌన్‌హాలు వ్యవస్థాపక దినోత్సవం 10న

నెల్లూరు నడిబొడ్డులో మహాదాత రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం (టౌన్‌హాలు) నెలకొల్పి ఇప్పటికి 107 సంవత్సరాలు. కళలకు సాహిత్యానికి పుట్టినిల్లయిన నెల్లూరుసీమలో కవులు, కళాకారులకు వేదికగా..సభలు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా..నెల్లూరు నగరానికే మకుటాయమానమైన కట్టడంగా పురమందిరం ఎంతో ఖ్యాతిని సముపార్జించుకుంది. ఈ నేపథ్యంలో టౌన్‌హాలు 107వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఏప్రిల్ 10వ తేదిన వేడుకగా నిర్వహించాలని ట్రస్ట్ బోర్డు నిర్ణయించిందని, అదే రోజు సాయంత్రం 6 గంటలకు టౌన్‌హాలులో పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, అందరూ ఆహ్వానితులేనని టౌన్‌హాలు ట్రస్ట్‌బోర్డు సెక్రటరీ జెవిస్ రెడ్డి ఈనెల 5న ఒక ప్రకటనలో తెలియజేశారు.

# పోలీసు అధికారులకు పురస్కారాలు

విధి నిర్వహణలో విశేష ప్రతిభతో జిల్లాలో సేవలందిస్తున్న పలువురు పోలీసు అధికారులకు రాష్ట్రప్రభుత్వం ఉగాది పురస్కారాలను ప్రకటించింది. స్పెషల్‌బ్రాంచ్ విభాగంలో పనిచేస్తున్న సిఐ అక్కేశ్వరరావుకు ఉత్తమ సేవాపతకం, ఆత్మకూరు సిఐ జి.వేణుగోపాలరెడ్డి, రాపూరు ఎస్ఐ జె.వెంకటేశ్వరరావు, సంతపేట హెడ్‌కానిస్టేబుల్ ఎస్.విజయసాగర్, దర్గామిట్ట ఎస్ఐ యు.బుజ్జయ్య, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ కెవి రామరాజు, ఏఆర్ ఎస్ఐ సిహెచ్ చంద్రశేఖర్‌రెడ్డిలకు సేవాపతకాలను ప్రభుత్వం ప్రకటించిందని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు తెలియజేశారు.

# పేదలకు 'అమ్మ యూత్' చేయూత

ఈనెల 2న ఉగాది పండుగ సందర్భంగా నెల్లూరులోని అమ్మ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని బాబూ గిరిజన సంఘంలో పేదలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, వస్త్రాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్, సభ్యులు శరత్‌కుమార్, లక్ష్మణ్, సాయి, రోహిత్, శశికిరణ్, కార్తికేయ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన ధరలపై సిపిఐ నిరసన



పెట్రోలు, డీజల్ ధరలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచుతుండడం దారుణమంటూ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 4న నిరసన తెలిపారు. ఈ ధరల దెబ్బకు ఇక ఎడ్లబండ్లే దిక్కంటూ ఎడ్ల బండిపై స్కూటర్‌ను, గ్యాస్ సిలిండర్‌ను పెట్టి వినూత్నంగా నిరసన ప్రదర్శన చేశారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, నాయకులు అరిగెల నాగేంద్రసాయి, రామరాజు, ఆంజనేయులు, నాగేంద్ర, షేక్ ముక్తియార్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాంగం పుస్తకాలు పంపిణీ

ఉగాది సందర్భంగా నెల్లూరులోని సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాదిరోజున పంచాంగం పుస్తకాలను పంపిణీ చేశారు. బివి నగర్‌లోని శ్రీ సాయిబాబా మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆలూరు శిరోమణిశర్మ పంచాంగ శ్రవణం చేయగా, సాయిబాబా మందిరం ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు ఆయనను సన్మానించారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో పంచాంగ పుస్తకాలను, స్వామివారి ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ట్రస్ట్ ఛైర్మెన్ సర్వేపల్లి రామమూర్తి, వైస్‌ఛైర్మెన్ సతీష్‌చంద్ర, సభ్యులు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

# ఎన్జీఓ కాలనీలో దొంగలుపడ్డారు

ఇంట్లో ఎవరూ లేని సమయం గమనించి ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ చేస్తున్న దొంగలు పేట్రేగిపోతున్నారు. ఈనెల 4న నెల్లూరులోని ఎన్జీఓ కాలనీలో ఉంటున్న రొయ్యలవ్యాపారి మాణిక్యం రాజన్ ఇంట్లో ఎవరూ లేనిది చూసుకుని దొంగలు తలుపులు పగులగొట్టి బీరువాలోని 50వేల రూపాయలతో పాటు 300 గ్రాముల వెండి వస్తువులను దోచుకుపోయారు. వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నెల్లూరు కబుర్లు

### అణగారినవర్గాల ఆశాజ్యోతి..

# బాబూ జగ్జీవన్‌రామ్

సమసమాజ స్థాపన కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన మహనీయుడు డా.బాబూ జగ్జీవన్‌రామ్ అంటూ జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు కొనియాడారు. ఈనెల 4న బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నెల్లూరు కలెక్టరేట్‌లో ఆయన జిల్లా అధికారులతో కలసి ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జేసీ హరేందిరప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్ జాహ్నవి, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు చెన్నయ్య, సర్వశిక్ష అభియాన్ ఏపిసి ఉషారాణి, మెప్మా పీడీ రవీంద్ర, డిటిసి చందర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కనక దుర్గాభవాని, డిఎస్‌డబ్ల్యుఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### 'సంతపేట' ఆంజనేయస్వామి

# బ్రహ్మోత్సవాలు 9 నుంచి

నెల్లూరు సంతపేటలో కొలువై ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఏప్రిల్ 9 నుంచి 20వ తేది దాకా స్వామివారి బ్రహ్మోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని దేవాలయ ఇఓ కృష్ణచైతన్య కోరారు. ఈనెల 3న ఆలయంలో ఆయన బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్పొరేటర్ విజయలక్ష్మి, ఇ.ఓ దర్గయ్య పాల్గొన్నారు.

# సినారాకు 'లయన్స్' సత్కారం



లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని ఉగాది సంబరాల్లో భాగంగా నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని పివిఆర్ కన్వెన్షన్ హాలులో ఈనెల 2వ తేదీ జరిగిన కార్యక్రమంలో కవి చిన్ని నారాయణరావు(సినారా) ఘనసత్కారం అందుకొన్నారు. దాదాపు 300 మంది లయన్స్ సభ్యులు పాల్గొన్న ఈ సభలో నారాయణరావును ఘనంగా సత్కరించారు. ఎన్ని ప్రభుత్వ సత్కారాలు, పురస్కారాలు అందుకొన్నా, సేవా పులకాంకితసభ్యులైన లయన్స్ అభిమానంతో ఆశీర్వదించడం అనిర్వచనీయమైనదని చిన్ని నారాయణరావు చెప్పారు. ఈ సందర్భంగా 'లాయర్' గత వారం ప్రచురించిన 'శుభ కృతూ... ఇప్పుడే రాకు' కవితను చదివి ప్రశంసలు పొందారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బయ్యా రవికుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని అధ్యక్షులు జె.వి.ఆర్‌మురళి, లయన్స్ మరియు ఇతర సభ్యులు చిన్ని నారాయణరావును సత్కరించారు.

# కవులు, కళాకారులను ఆదరించాలి



సన్మానగ్రహీతలతో నెరసం సభ్యులు

కళలు, కవిత్వం ద్వారా సమాజానికి ఎంతో సేవలందిస్తున్న కవులు, కళకారులను అందరూ ఆదరించాలని విశ్రాంత రెవెన్యూ అధికారి సిహెచ్ పెంచలరెడ్డి అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని ఈనెల 3న నగరంలోని టౌన్‌హాలు ప్రాంగణంలో ఉన్న రీడింగ్‌రూమ్‌లో నెల్లూరుజిల్లా రచయితల సంఘం (నెరసం) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రముఖ సాహితీవేత్త మెట్టు రామచంద్రప్రసాద్‌కు నెరసం తరఫున ఉగాది పురస్కారాన్ని అందజేశారు. నెరసం అధ్యక్షుడు ఏ.జయప్రకాష్, పిఎంపిల సంఘం నాయకుడు శాఖవరపు వేణుగోపాల్, కార్పొరేటర్ సత్తార్‌కు ఆత్మీయ పురస్కారాలను ప్రదానం చేశారు. ఆధ్యాత్మికవేత్త రామాయణం మహేష్‌స్వామి, నారాయణ దంతకళాశాల డీన్ డాక్టర్ శివకుమార్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ రమాదేవి, శివకుమార్, లక్ష్మి, నజ్మా షమీ, మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# శబరి శ్రీరామక్షేత్రంలో.. విశేష పూజలు



శ్రీరామనవమి పర్వదినాలను పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రంలో స్వామివార్లకు విశిష్ట పూజలు చేస్తున్నారు. శబరి శ్రీరాముడికి వసంత నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఈనెల 5న సీతారామలక్ష్మణులకు, హనుమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరేష్‌స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ ఉగాది సంబరాలు



ఉగాది పండుగను పురస్కరించుకుని నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2న వేడుకలు జరిగాయి. వాకర్స్ అందరూ సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాఘవాచార్యులు పంచాంగశ్రవణం చేశారు. అనంతరం శుభకృతు నామసంవత్సరంలో జన్మించి 60ఏళ్ళు పూర్తిచేసుకున్న సభ్యులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, హస్తి లక్ష్మణరాజు, దాసరాజు వెంకట్రాజు, జి.మోసెస్‌లకు ఉగాది పురస్కారాలు అందజేశారు. కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి రావూరి సుబ్బారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ నలుబోలు బలరామయ్యనాయుడు, రాజేంద్రప్రసాద్, నజీర్‌అహ్మద్, కృష్ణారెడ్డి, సోను, సుబ్బరాజు తదితర సభ్యులు పాల్గొన్నారు.

# విఆర్‌సి వాకర్స్.. ఉగాది పండుగ



నెల్లూరులోని విఆర్‌సి వాకర్స్, విఆర్‌సి వనితా వాకర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 2న శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు జరిగాయి. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పండితులు ఆలూరి శిరోమణిశర్మ పంచాంగశ్రవణం చేసి వాకర్స్ సన్మానం అందుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు..'అమ్మ ఫర్నిచర్స్' అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి, వనితా వాకర్స్ అధ్యక్షురాలు సుభాషిణి, ప్రముఖ చర్మవ్యాధుల స్పెషలిస్ట్ డాక్టర్ భాస్కర్‌రావు, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ పెంచలయ్య, ఆర్గనైజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు. ఎంతో సంబరంగా జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ అందరికీ ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

### సిపిఎస్ రద్దుకోసం..

# 18 నుంచి 'పోరు గర్జన'



సిపిఎస్ రద్దును కోరుతూ 'పోరు గర్జన'పేరుతో ఈనెల 18 నుంచి 25వ తేది వరకు ఆందోళనలు నిర్వహిస్తామని యుటిఎస్ నాయకులు తెలిపారు. ఆ మేరకు వారు పోస్టర్లను నెల్లూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో ఈనెల 5న విడుదల చేశారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఉద్యోగభద్రత లేకుండా చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినతర్వాత ఆ విషయం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పింఛను భిక్ష కాదు.. వేతనజీవుల హక్కు అని పేర్కొన్నారు. సిపిఎస్ రద్దు చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయాన్ని అంగీకరించేది లేదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకుడు పి.బాబురెడ్డి, నాయకులు రాజశేఖర్, అచ్చయ్య, మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చిలో మంచినీటి సౌకర్యాలకు.. సిఎం గ్రీన్‌సిగ్నల్

## - కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటుచేసి, అందరికీ సురక్షిత మంచినీటిని అందించేందుకు ప్రభుత్వానికి దాదాపు 85 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, సంగం బ్యారేజీ నుంచి పైప్‌లైన్ ఏర్పాటుచేసి ప్రజలకు మంచినీటిని అందించేందుకు ప్రతిపాదనలు పంపగా వాటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారని, త్వరలోనే వాటి పనులు ప్రారంభమవుతాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 2న బుచ్చిలోని రామచంద్రాపురం 20వ వార్డులో వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ రెండేళ్ళలో కోవూరు నియోజకవర్గంలో సుమారు 90 వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటుచేశామని, ఎమ్మెల్యే గ్రాంట్ కింద ముఖ్యమంత్రి 2 కోట్లు కేటాయించారని, ప్రతి మండలానికి 40 లక్షల వంతున కేటాయించి అభివృద్ధి పనులు చేస్తామని ఆయన తెలిపారు. పలు వార్డుల్లో రోడ్లు, డ్రైన్ల పనులకు రెండు కోట్ల రూపాయలను మంజూరు చేశామన్నారు. వైకాపా నాయకులు ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, ఇన్నమూరి నరసింహారావు, బుచ్చి ఛైర్‌పర్సన్ సుప్రజ, వవ్వేరు బ్యాంక్ ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్ శ్రీదేవి, నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మోర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.



### ప్రసన్న చేతులమీదుగా ప్రగతి పనులు

కోవూరు మండలం పడుగుపాడులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ. 12 లక్షలతో నూతనంగా నిర్మించిన బ్యాంకింగ్ కౌంటర్ మరియు స్టాండ్ రూమ్ ప్రారంభోత్సవానికి, రూ. 24 లక్షలతో నూతనంగా చేపట్టనున్న గోడౌన్ నిర్మాణానికి ఇటీవల కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న శంకుస్థాపన చేశారు.

# వైద్య విద్యలో సీట్లు పెంచాలి

## పార్లమెంట్‌లో ఉక్రెయిన్‌పై జరిగిన చర్చలో ఎంపీ మాగుంట



ఉక్రెయిన్‌లో మెడిసిన్ చదువులకు వెళ్ళి, యుద్ధం కారణంగా అర్థాంతరంగా భారత్‌కు తిరిగి వచ్చిన విద్యార్థులకు ఇక్కడే మెడిసిన్ పూర్తిచేసే అవకాశం కల్పించి, వారిని ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 5న పార్లమెంట్‌లో ఉక్రెయిన్ పరిస్థితిపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉక్రెయిన్ నుంచి మనదేశానికి తిరిగివచ్చిన వైద్యవిద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారికి దేశీయంగా వైద్యకళాశాలల్లో ఉన్నతవిద్యలను చదువుకునేందుకు అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## శ్రీసిటీ ఆధ్వర్యంలో..

# మాదనపాళెంలో కమ్యూనిటీ లైబ్రరీ



శ్రీసిటీలోని ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్నాన్సెస్ (ఐఎఫ్ఎఫ్) పరిశ్రమ యాజమాన్యం తమ సీఎస్ఆర్ చర్యల్లో భాగంగా రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ (రీడ్) సంస్థ భాగస్వామ్యంతో శ్రీసిటీ పరిధిలోని మాదనపాళెం గ్రామంలో కమ్యూనిటీ లైబ్రరీ, రిసోర్స్ సెంటర్‌ను ఇటీవల ఏర్పాటు చేసింది. రీడ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ రంగశ్రీ కిషోర్ సమక్షంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్ దీనికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్య మరియు కమ్యూనిటీ అభివృద్ధిని ప్రోత్సహించడమే రీడ్ కమ్యూనిటీ లైబ్రరీ మరియు రిసోర్స్ సెంటర్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తమ సంస్థ భారతదేశం అంతటా 12 రాష్ట్రాలలోని 18 జిల్లాలలో 230 పైగా గ్రామాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం ఇరుగుళం గ్రామంలో ఈ సెంటర్‌ను ప్రారంభించామని, దానికి కొనసాగింపుగా నేడు మాదనపాళెంలో మరొకటి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఐఎఫ్ఎఫ్ పరిశ్రమ యాజమాన్యానికి, శ్రీసిటీ ఫౌండేషన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. దీనిని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో ఐఎఫ్ఎఫ్ పరిశ్రమ యాజమాన్యం రీడ్ ఇండియా ద్వారా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. గ్రామస్థులు, ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, దీని నుండి మంచి ఫలితాలను పొందుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ రమేష్, మండల విద్యాశాఖాధికారి రవి, మాదనపాళెం స్కూల్ ప్రధానోపాధ్యాయులు మునిమోహన్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

# మద్ధతు ధర ఇచ్చి.. అన్నదాతలను ఆదుకోండి

## - మాజీమంత్రి సోమిరెడ్డి

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళలో దళారుల ప్రమేయాన్ని అడ్డుకుని ప్రభుత్వం నిర్ణయించిన రూ. 16,650 మద్దతు ధరతోనే ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలం మండలం కనుపూరులో ఈనెల 5న జరిగిన గౌరవ సభలో ఆయన ప్రసంగిస్తూ వైకాపా నాయకుల తీరుపై ధ్వజమెత్తారు. మంత్రి పదవుల కోసం సీఎం చుట్టూ ప్రదక్షిణలు చేయడం కాదు.. మీకు ఓట్లు వేసిన రైతులను, రైతు బిడ్డలను కాపాడండి అని ఆయన అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలకు సత్తా ఉంటే రోడ్లపైకి వచ్చి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరతో కొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. కారుచౌకగా వడ్లను దళారులకు అమ్ముకొని నష్టపోయిన రైతులకు రూ. 15వేలు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఇప్పటి వరకు ధాన్యాన్ని అమ్ముకోని రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన రూ. 16,650 మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలన్నారు. జిల్లాలో ఒక లక్ష 50వేల ఎకరాలకు 25 లక్షల పుట్లు దిగుబడి ఉంటే ప్రభుత్వం కొన్నది రెండు లక్షల పుట్లేనని, మిగిలింది దళారులు చౌకగా కొనేస్తున్నారని, ఇదెక్కడి అన్యాయమని



ప్రశ్నించారు. జగన్ పాలనలో రాష్ట్రానికి భవిష్యత్ లేకుండా పోతోందని, వైసీపీ హయాంలో ఏడుసార్లు విద్యుత్ చార్జీలను అమాంతంగా పెంచేశారని, రైతులకు, సామాన్య ప్రజలకు కరెంటు కోతలు తప్పడం లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షులు కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, మామిళ్ళపల్లి శ్రీనివాసులునాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు గుమ్మడి రాజాయాదవ్, తిరుపతి పార్లమెంటరీ తెలుగు రైతు విభాగం అధ్యక్షులు రావూరి రాధాకృష్ణమ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాల మొండి వైఖరితోనే.. ప్రజలపై భారం

## - డిసిసి నేత చేవూరు విమర్శ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ చేతగానితనం, మొండివైఖరి వల్లే పెట్రోలు, డీజల్, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని జిల్లా కాంగ్రెస్ నాయకుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 6న నెల్లూరులో డిసిసి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. స్థానిక ఇందిరాభవన్ వద్ద నుంచి గాంధీబొమ్మ కూడలి దాకా భారీ ర్యాలీ చేపట్టారు. కేవలం కొంతమంది బడా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చేందుకే సామాన్యులపై భారం వేయడం దుర్మార్గపు చర్య అని, గతంలో కాంగ్రెస్ హయాంలో 400 రూపాయలకే లభించిన వంటగ్యాస్ ధర బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు వెయ్యిరూపాయలకు చేరుకుందని, ఇది సామాన్యుల నడ్డివిరవడమేనని అన్నారు. డీజల్, పెట్రోలు ధరలు



పెరగడం వల్ల రవాణా, వాణిజ్య వ్యవస్థలు కూడా దెబ్బతిని నిత్యాసరసరుకుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయన్నారు. రాజన్న రాజ్యం, రామరాజ్యం తెస్తామని ప్రజలను మభ్యపెట్టిన నాయకులు అధికారంలోకి వచ్చాక అప్పులు, ఆర్థికభారాలతో రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారని ఆయన విమర్శించారు. ధరలను అదుపు చేయడం చేతకాకపోతే అధికారం నుంచి తప్పుకోవాలన్నారు. ధరలను ఎలా అదుపు చేయాలో, ప్రజా సంక్షేమ పథకాలు ఎలా ప్రజలకు అందించాలో తగిన సలహాలు సూచనలు ఇచ్చేందుకు కాంగ్రెస్‌పార్టీ సిద్ధంగా ఉంటుందన్నారు. ఉడతా వెంకట్రావు, చింతాల వెంకట్రావు, షేక్ ఫయాజ్, పరిమళ వెంకటేశ్వర్లు, దుద్దుకూరు రమేష్ నాయుడు, బాలసుధాకర్, శ్రీనివాసులురెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.






## శ్రీసిటీ ఫౌండేషన్‌చే..గ్రామాల్లో దోమల నివారణ



శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీసిటీ పరిధిలోని పలు గ్రామాల్లో దోమలవ్యాప్తి నివారణకై మురుగునీళ్ళు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మొలాథిన్ తదితర మందులు పిచికారి చేశారు. మల్లవారిపాలెం వెస్ట్, మల్లవారిపాలెం ఈస్ట్, మల్లా టౌన్ షిప్, గొల్లవారిపాళెం, చెంగంబాక్కం గ్రామాల్లో ఇటీవల మూడురోజుల పాటు ముమ్మరంగా ఈ పనులు చేపట్టారు. మిగిలిన అన్ని గ్రామాల్లో కూడా దోమల నివారణ, పారిశుద్ధ్యచర్యలు చేపట్టనున్నట్లు ఫౌండేషన్ సిబ్బంది తెలిపారు.

## సత్యవేడు కాలేజీకి.. శ్రీసిటీలోని జపనీస్ కంపెనీ వితరణ

కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ గ్రూప్ (ఎస్‌జెసీజీ) చిత్తూరుజిల్లాలోని సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సుమారు 2 లక్షల రూపాయల విలువైన 30 స్టూడెంట్ డెస్కులను ఇటీవల కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్‌కు అందచేశారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ ప్రతినిధి హిరానో మాట్లాడుతూ 2017లో ఏర్పాటైన శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ గ్రూప్ (ఎస్‌జెసీజీ) వరుసగా ఐదవ ఏడాది తమ సీఎస్ఆర్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఆ కాలేజీకి డెస్కులతో పాటు భవిష్యత్తులో మరింత సాయం అందిస్తామన్నారు. శ్రీసిటీలో 25కు పైగా జపాన్ పరిశ్రమలు ఉన్నాయని, భవిష్యత్తులో అందరికి మంచి ఉద్యోగాలు వస్తాయన్నారు. జపనీస్ గ్రూప్ వితరణ పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ తన ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఇదే జూనియర్ కళాశాలలో శ్రీసిటీలోని మరో పరిశ్రమ చేయూతతో 16 లక్షల వ్యయంతో మరుగుదొడ్ల నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, శ్రీసిటీలోని జపాన్ పరిశ్రమల ప్రతినిధులు సెంథిల్ కుమార్ (ఇసుజు), ఫుజ్జి (నిటాన్), తాకిబాన (ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్), కమాడ (టీహెచ్‌కె), ఆనంద (యూనిఛార్మ్), సకాయి (ఐసాన్), ప్రతినిధులు, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### సిఎం నిర్ణయంతో..

# రాపూరుకు న్యాయం జరిగింది

## - మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం హర్షం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి

2009లో నియోజకవర్గాల పునర్విభజనలో రాపూరుకి అన్యాయం జరిగిందని, అయితే జిల్లాల పునర్విభజన చేయాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజా ఆలోచనతో ఇప్పుడు న్యాయం జరిగిందని మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 4న రాపూరులో 2 కోట్ల 30 లక్షలతో ఎంఆర్‌ఓ, ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం నిర్ణయంతో జలవనరులన్నీ నెల్లూరుజిల్లాలోనే ఉండబోతున్నాయని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఇలాంటి మంచి అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాపూరు, సైదాపురం, కలువాయి వాసుల ఆకాంక్షను నెరవేర్చిన గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని ఆయన కొనియాడారు. నియోజకవర్గంలో 20 వేల మంది పిల్లలకు టెట్రా మిల్క్ , బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి ప్రాతినిధ్యం వహించిన నియోజక వర్గం రాపూరేనని, ఆనం సంజీవరెడ్డి కూడా రాపూరునుంచి గెలిచి మంత్రి అయ్యారని, తమ కుటుంబం నుంచి మూడో వ్యక్తిగా ప్రజలు తనను కూడా గెలిపించి మంత్రిని చేశారని అన్నారు.

సర్వేపల్లిని నెల్లూరులో కొనసాగేలా కృషిచేసిన ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలు నెల్లూరు ఉండేలా చేసిన ఘనత ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డిదేనన్నారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా పనిచేసి అభివృద్ధికి బాటలు వేస్తామని చెప్పారు. సోమశిల.. తెలుగు గంగ ప్రాజెక్టులతో పాటు కలువాయిని నెల్లూరు జిల్లాలో కొనసాగించేలా కృషి చేసిన రామనారాయణరెడ్డికి మండల ప్రజలు రుణపడి ఉంటారని జడ్పీటీసీ అనీల్ కుమార్ రెడ్డి అన్నారు. తొలుత సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ కలువాయి మండల ప్రజలు, నాయకులు నిర్వహించిన భారీ ర్యాలీలో ఆనం రామనారాయణరెడ్డితో పాటు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించిన సీఎం జగన్ చిత్రపటానికి అందరూ కలసి పాలాభిషేకం చేశారు.

# సకల సద్గుణశోభితుడు.. శ్రీరామచంద్రుడు

## 'రామాయణ సప్తాహం'లో అవధాని కోట రాజశేఖర్



మానవాళికి ఆదర్శంగా నిలచిన ధర్మమూర్తి.. ధర్మ పరిపాలకుడు శ్రీరామ చంద్రుడని, సాక్షాత్తూ ఆ భగవంతుడే లోకకల్యాణం కోసం త్రేతాయుగంలో మానవునిగా అవతరించి, రావణాది రాక్షసులను నిర్జించి, ధర్మాన్ని పరిరక్షించి నేటికీ అందరి పూజలందుకుంటున్నాడని, సకల సద్గుణశోభితుడైన ఆ శ్రీరాముని దివ్యచరితమే శ్రీమద్రామాయణమని ప్రముఖ అవధాని, ఇనమడుగు శ్రీ సత్యానందాశ్రమ ఆస్థాన పండితులు కోట రాజశేఖర్ అన్నారు. కోవూరులోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మప్రచార పరిషత్ నెల్లూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రామాయణ సప్తాహం'లో భాగంగా ఈనెల 5న జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, రామాయణం లోకపూజితమని, రాముడు మానవాళికి ఆదర్శనీయుడని కొనియాడారు. రామాయణం బాలకాండలోని శ్రీరామ జననం, విశ్వామిత్ర యజ్ఞ సంరక్షణ, శివధనుర్భంగం, సీతారామకల్యాణం తదితర ఘట్టాలను ఆయన భక్తులకు చక్కగా విశదీకరించారు. ప్రముఖ సాహితీవేత్త డా.చీమకుర్తి వెంకటేశ్వరరావు, టిటిడి ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ ఎన్.దేవరాజ్, ప్రముఖ పారిశ్రామికవేత్త కాటంరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ సిడిసి ఛైర్మెన్ కృష్ణారెడ్డి, రిటైర్డ్ సిపిఓ వనం సుబ్రహ్మణ్యం, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు శ్రీరామమందిరం దేవస్థానానికి పల్లకి నిమిత్తం పదివేల రూపాయలను ఆలయ కమిటి ప్రతినిధి నీరుకట్టు మోహన్‌దాస్‌కు అందజేస్తున్న ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డా. సి.రోహిణి

### వికలాంగులకు

# నిత్యావసర వస్తువులు




గూడూరు, శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 5వ తేదీ రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ క్లబ్ మరియు ఆంధ్ర మహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డా.సి.రోహిణి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి దాతగా స్నేహలతారెడ్డి వ్యవహరించి రూ.5,000లు అందజేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మి, మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, రెడ్ సంస్థ ప్రెసిడెంట్ జానా సుధీర్, పల్లం వెంకటేశ్వర్లు, శ్రీనివాసఆచారి పాల్గొన్నారు.

# జగజ్జీవన్‌రామ్ జయంతి



భారతదేశ మాజీ ఉపప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ శ్రీ బాబూ జగజ్జీవన్‌రామ్ 115వ జయంతి సందర్భంగా గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌లో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, చిల్లకూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీ పలువురు నాయకులతో కలసి జడ్పీటీసీ సభ్యులు మన్నెం శ్రీనివాసులు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో వలసవాదానికి, ప్రజాస్వామ్యవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమ పోరాటంతో పాటు కుల నిర్మూలన, సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో పేద, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన వ్యక్తి జగజ్జీవన్‌రామ్ అని తెలిపారు. వైయస్సార్సీపీ నాయకులు ప్రభాకర్, సందాని, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.




# కొత్త జిల్లా... కొత్త సారధులు!



కొత్త జిల్లాల ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తిరుపతి జిల్లా కొత్త సారధులు కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపి గురుమూర్తి. మొదట బాలాజీ జిల్లాగా నామకరణం చేసి, మళ్ళీ తిరుపతి జిల్లాగా మారిన ఈ జిల్లాకు తొలిసారిగా వచ్చిన అధికారులు ఒకరు వెంకటరమణ, ఒకరు పరమేశ్వర్‌లు కావడం ఒక విశేషమైతే... జాయింట్ కలెక్టర్ పేరు బాలాజీ కావడం మరో విశేషం!!

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

### శ్రీ శ్రీరామ రక్షా సేవాసంఘం ఆధ్వర్యంలో

# గురుగుహచే పంచాంగ శ్రవణం



సత్కారాన్నందుకుంటున్న శిరోమణిశర్మ, రామ్మోహన్‌రావు

ఈ నెల 2వ తేదీ తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గూడూరులోని శ్రీ శ్రీరామ రక్షా సేవాసంఘం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు జరిగాయి. ప్రముఖ పంచాంగ శ్రవణకర్త జి.కె.గురుగుహ కొత్త సంవత్సరం ఏ విధంగా ఉంటుందో చాలా చక్కగా భక్తులకు తెలియజేశారు. ప్రముఖ కవి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, విశ్రాంత తెలుగు పండితులు ఆలూరు శిరోమణిశర్మ ఉపన్యాస అనంతరం ఆయనను, గూడూరు శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థాన ఛైర్మెన్, ప్రముఖ ఆడిటర్, బ్రాహ్మణ సేవాసంఘం గౌరవాధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావును, జొన్నవాడ కామాక్షమ్మ ఆలయం ప్రధానార్చకులు ప్రసాదరావులను శ్రీరామరక్షా సేవాసంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వై.చిట్టిబాబు, వై.పవన్, సభ్యులు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం, అదిశంకర బ్రాహ్మణ సేవాసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ధరల పెంపు దారుణం




కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని, పెంచిన కరెంటు ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సి.పి.ఐ(యం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గూడూరు టవర్ క్లాక్ సెంటర్లో ఈనెల 4వ తేదీన ధర్నా చేపట్టారు. సి.పి.ఐ(యం) రాష్ట్ర కమిటీ సభ్యులు నెల్లూరు యాదగిరి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తానని హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉగాది కానుకగా విద్యుత్ ఛార్జీలను పెంచడం అన్యాయమని, నిత్యావసర సరుకుల ధరలు అడ్డూ అదుపూ లేకుండాపోయాయన్నారు. ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో ఆగస్టు నుండి మళ్ళీ కరెంటు ఛార్జీలు పెంచుతామని చెప్పడం సీఎం జగన్ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ఇక నరేంద్ర మోడీ ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు అమాంతం పెంచేశారని, ఈ ధరలతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు.

# కళ్యాణ వీరభద్రుడికి ప్రత్యేక పూజలు



అన్నదానం నిర్వహిస్తున్న దేవాలయ సభ్యులు

గూడూరు పట్టణం, త్యాగరాజవీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 5వ తేదీ ప్రత్యేకపూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కాగా, రెండో పట్టణంలోని ఎగువవీరారెడ్డిపల్లి ప్రాంతంలో శ్రీ సీత, లక్ష్మణ, హనుమంత సమేత శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

# ధరలు తగ్గించండి బాబోయ్

**సిపిఎం ధర్నాందోళన**



పెట్రోలు, డీజల్‌తో పాటు వంటగ్యాస్, విద్యుత్..ఇతర నిత్యావసర సరుకుల ధరలన్నీ భారీగా పెరిగిపోతున్నాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాలను పట్టించుకోక పోవడం దారుణమని సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 4న నెల్లూరు నగరంలో పెద్దఎత్తున ధర్నాందోళన నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ ధర వెయ్యి రూపాయలు దాటిందని, పెట్రోల్ ధర 120 రూపాయల దాకా, డీజల్ ధర 105కు పైగా పెరిగిందని, ధరలింతగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వాలు పెరుగుతున్న ఈ ధరలను వెంటనే నియంత్రించాలని సిపిఎం నాయకుడు, మాజీ డెప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సిపిఎం నాయకులు కిన్నెర కుమార్, కొండా ప్రసాద్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జెన్‌కో పరిరక్షణే ధ్యేయం

**విద్యుత్ ఉద్యోగుల జెఏసి నాయకులు**



జెన్‌కో థర్మల్‌కేంద్రాన్ని పరిరక్షించుకుంటామని, అందుకోసం పోరాటం ఉధృతం చేయాలని విద్యుత్ ఉద్యోగుల జెఏసి నాయకులు పిలుపునిచ్చారు. నేలటూరులోని జెన్‌కో ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా గత 74 రోజులుగా ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు జెన్‌కో పరిరక్షణ ధ్యేయంగా చేస్తున్న ఆందోళనలో భాగంగా ఈనెల 4న జెన్‌కో ఎదుట బైఠాయించారు. జేఏసి నాయకులు మాట్లాడుతూ ఇకపై జెన్‌కో థర్మల్ కేంద్రం పరిరక్షణ బాధ్యత రాష్ట్ర జేఏసి తీసుకుంటుందన్నారు. ఇన్ని రోజులుగా ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ ఆందోళనలో జెన్‌కో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఇంజనీర్లు పాల్గొన్నారు

**● విద్యుత్ చార్జీలపై టిడిపి ఆందోళన**

# విసనకర్రలతో వినూత్న ప్రదర్శన

విద్యుత్‌చార్జీలు పెరిగిపోవడంతో ఇక ప్రజలకు విసనకర్రలే దిక్కంటూ వినూత్నంగా ప్రదర్శన చేస్తూ వెంకటాచలంలోని టిడిపి నాయకులు ఈనెల 5న నిరసన ప్రదర్శన నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ దాకా ర్యాలీ చేపట్టారు. విసనకర్రలతో విసురుకుంటూ అర్ధనగ్నంగా మోకాళ్ళపై నిలబడి నినాదాలు చేశారు. విద్యుత్ చార్జీలు పెంచి రైతుల్ని నిలువునా నట్టేట ముంచిన ఘనత ఒక్క వైఎస్సార్సీపీకే దక్కిందంటూ విమర్శించారు. విద్యుత్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. అనంతరం విద్యుత్‌శాఖ సిబ్బందికి వినతిపత్రం



అందజేశారు. టిడిపి నాయకులు శ్రీనివాసులు నాయుడు, రాధాకృష్ణమనాయుడు, రమేష్‌నాయుడు, రఘురామయ్య, శ్రీహరి, కె.మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## బారాషహీద్ దర్గా వద్ద..
# పునీత్‌సాగర్



'పునీత్‌సాగర్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఈనెల 3న నెల్లూరు చెరువు వద్ద ఉన్న బారాషహీద్ దర్గా ప్రాంతంలో వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన 10-ఏ నేవల్ ఎన్‌సిసి యూనిట్ల క్యాడెట్లు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తాచెదారాన్నంతా తొలగించి శుభ్రం చేశారు. నెల్లూరు 10ఏ నేవల్ ఎన్‌సిసి యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ వినయ్ రామచంద్రన్ ఆదేశాలతో యూనిట్ సిబ్బంది సాయికుమార్, రమణ, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

## బుచ్చి కోదండరామాలయం
# బ్రహ్మోత్సవాలు 9 నుంచి

**● ఏర్పాట్లను సమీక్షించిన అధికారులు**

ప్రముఖ రామాలయంగా పేరుగాంచిన బుచ్చిరెడ్డిపాలెంలోని సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామాలయంలో ఈనెల 9 నుంచి 19వ తేది వరకు పెద్దఎత్తున బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 5న నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. స్వామివారి రథోత్సవం, కల్యాణోత్సవం, తెప్పోత్సవం, గరుడసేవలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు కనుక వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆలయ ఛైర్మెన్ దొడ్ల మురళీకృష్ణారెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసరావు, సిఐ కోటేశ్వరరావు, వైస్ ఛైర్‌పర్సన్ లలితారెడ్డి, నాయకులు మురళి, భరత్, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో.. 9న సాంకేతిక సదస్సు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో ఇటీవల 'ఆక్సియన్' జాతీయ సదస్సుకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 9న జరిగే ఈ సదస్సులో అనేక సాంకేతికపరమైన అంశాలను వివరిస్తా రని, విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇసిఇ విభాగాధిపతి డా. జి.హరినాథ్‌రెడ్డి, కన్వీనర్ జి.నాగార్జునరెడ్డి, కోఆర్డినేటర్లు గీతికారెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# కరుణాసాగరుడు..'సిద్ధవరం' కల్యాణ రాముడు

*'భండన భీముడార్తజన బాంధవుడుజ్వల బాణతూణ కోదండ కళాప్రచండ భుజ తాండవకీర్తికి రామమూర్తికిన్ రెండవసాటి దైవమిక లేడనుచున్ గడగట్టి భేరికా ధాండ దధాండ ధాండ నినదమ్ములజాండమ్ము నిండ మత్త వేదండమునెక్కి చాటెదన్!...'* అంటూ 'రాముడంటే కరుణా సముద్రుడని, ఆర్తజన బాంధవుడని, బాణతూణాలు కలిగిన విలువిద్యలో సాటిలేని మేటి అని, ఏరకంగా చూసినా ప్రపంచంలో అసలు రాముడికి సాటిలేని దైవమిక లేనే లేదని'.. బ్రహ్మాండమంతా భేరికా వాద్యాలతో చాటిచెప్తానంటోంది.. 'దాశరథి శతకం'. ఆపదలనుంచి గట్టెక్కించే దేవుడు, సర్వసంపదలనిచ్చే దేవుడు రాముడేనని 'ఆపదామప హర్తారాం..దాతారం సర్వసంపదాం'..అంటోంది 'ఆపదుద్ధారక స్తోత్రం'. కనుకనే లోకకల్యాణం కోసం మానవుడిగా పుట్టినా దేవుడుగానే రాముడు భారతావని అంతటా పూజలందుకుంటున్నాడు. నెల్లూరుజిల్లాలోనూ రామభక్తులకు, రామాలయాలకు కొదవేలేదు. అలాంటి ఉత్కృష్టమైన రామాలయాల్లో మరో మహత్తరమైన ఆలయం సిద్ధవరంలో ఉంది. అదే 'శ్రీ కల్యాణ రామాలయం'. ఈ ఆలయ నిర్మాణం వెనుక ఘనమైన చరిత్ర కూడా ఉంది.

నెల్లూరుజిల్లాలోని మండలకేంద్రమైన కోటకు సుమారు 8 కిలోమీటర్ల దూరంలోని సిద్ధవరం గ్రామంలో ఉన్న రామాలయంలో రాముడు శ్రీ కల్యాణరామునిగా కొలువై ఉన్నాడు. కోట నుంచి సిద్ధవరం గ్రామానికి బస్సులు లేకున్నా ఆటోల సౌకర్యం ఉంది.

### ఆలయ చరిత్ర :

సిద్ధవరంలో ఓ 80 ఏళ్ళ క్రితం నుంచి శ్రీ ఆంజనేయ స్వామికి దేవాలయం ఉండేది. ఆ ఊరి గ్రామస్తులే కాక, ఇరుగుపొరుగునున్న అనేక పల్లెప్రాంతాల ప్రజలంతా ఆ ఆలయానికి వెళ్ళి పూజలు చేస్తుండేవారు. అయితే ఆంజనేయస్వామి ఉన్నా రాముడికి ఆలయం లేకపోవడం లోటుగానే ఉండేది.





## మన దేవాలయాలు (94)

ఈ నేపథ్యంలో సిద్ధవరం నివాసులైన దాతలు దువ్వూరు రాజగోపాలరెడ్డి - సునందమ్మ, వారి కుమారుడు ధృవకుమార్‌రెడ్డి-జాహ్నవి దంపతులు అక్కడ రామాలయం నిర్మించి ప్రజలకు రాముడి గుడి లేదనే కొరతను తీర్చారు. అనుకున్నదే తడవుగా ఆంజనేయస్వామి దేవాలయం వెనుక ఉన్న కొంత స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలం ఇచ్చినవారికి డబ్బు ఇవ్వడమే కాక, వారికి ఎలాంటి ఇబ్బంది ఉండకూడదని మరోచోట స్థలం ఇచ్చి ఇల్లు కూడా కట్టించి ఆ దాతలు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆరేళ్ళ క్రితం జరిగిందిదంతా. దానధురేయులు దువ్వూరు వారి నేతృత్వంలోనే అక్కడ దేవాలయ నిర్మాణానికి 2016లో శంకుస్థాపన జరిగింది. ఈ దైవకార్యానికి సిద్ధవరం గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ఉన్న అనేక గ్రామాల ప్రజలు ప్రతి ఇంటి నుంచి ఓ ఇటుకను తెచ్చి పూజించి ఆ 'రామశిలల'తో ఆరామం నిర్మాణంలో పాల్గొని తమవంతు భాగస్వాములు కావడం విశేషం. ఎన్నో ఆలయాల్లో విగ్రహప్రతిష్ఠలు చేసి ఉత్తమ అర్చకునిగా పేరొందిన స్థానిక వేదపండితుడు వాకాని కృష్ణప్రసాద్ ఆచార్యుల నేతృత్వంలో, తిరుపతి నుంచి టిటిడి వారి సహకారం, గణపతి స్థపతి వాస్తుసలహాలతో ఎంతో భక్తిశ్రద్ధలతో ఆ దాతలు శాస్త్రబద్ధంగా రామాలయం నిర్మించారు.

### సర్వాంగ సుందరంగా ఆలయం

గర్భాలయంలో సీతారామలక్ష్మణుల మూలమూర్తులు భక్తాభీష్టప్రదాయకులుగా అభయముద్రతో కొలువై ఉండడం, చెంతనే హనుమ, విఘ్నేశ్వరుడు, విష్వక్సేనుని మందిరాలు, దుర్గాదేవి, హయగ్రీవస్వామి, నారసింహస్వామి ఉపాలయాలతో ఆలయం సర్వాంగసుందరంగా ఉండడం ఈ ఆలయ విశిష్టత. ఈ ఆలయంలో ప్రదక్షిణలు చేసి పూజలు చేసుకున్నవారి కోర్కెలు నెరవేరడమే కాక, ముఖ్యంగా అవివాహితులకు వారు కోరుకున్నట్లుగా కల్యాణం జరగడం, సంతానప్రాప్తి కలుగుతుండడంతో ఈ ఆలయం 'శ్రీ కల్యాణ రామాలయం'గా పేరెన్నికగన్నది.

### ప్రతి ఏటా వైభవోత్సవాలు

ఆలయంలో నిత్యపూజలతో పాటు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ రోజును పురస్కరించుకుని ప్రతిఏటా చైత్రమాసం వైశాఖ శుద్ధ పంచమినాడు మూడురోజుల పాటు వైభవోపేతంగా వైభవోత్స వాలు నిర్వహిస్తుంటారు. ధనుర్మాసంలో గ్రామస్తులే ఉభయకర్త లుగా నెలరోజుల పాటు కోలాహలంగా వేడుకలు జరుపుతుంటారు. శ్రీరామ చంద్రుని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రం రోజున విశేష పూజలు, శ్రీరామనవమి నాడు విశిష్ట సేవలు జరుగుతుంటాయి. ఈ ఉత్సవాలన్నిటికీ పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు.

'జ్ఞానానందమయం.. దేవం' అన్నట్లుగా జ్ఞానాన్ని ప్రసాదించే హయగ్రీవస్వామికి పూజలు చేయడంతోపాటు, ఏటా ఆ స్వామి జయంతి రోజున సిద్ధవరం, గోవిందపల్లి గ్రామాల్లో పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, విద్యా పరికరాలు వితరణగా అందజేస్తుండడం మరో విశేషం.



## ముహూర్తం ఫిక్స్....

మంత్రివర్గ మార్పు కూర్పులకు జగన్ ప్రభుత్వం సంసిద్ధమయ్యింది. ఏప్రిల్ 11వ తేదీ ముహూర్తం ఫిక్సయిపోయింది. ఏప్రిల్ 6వ తేదీన గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ని కలిసిన జగన్ మార్పుల విషయం తెలియపరచి ఆయన సమయం ఇవ్వవలసిందిగా కోరారు.

### ఏపి ట్రేడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

## ఛైర్మెన్‌గా కనుమూరు రవిచంద్రారెడ్డి



ఆంధ్రప్రదేశ్ వ్యాపార అభివృద్ధి సంస్థ ఛైర్మెన్‌గా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నేత, జాతీయ అధికార ప్రతినిధి కనుమూరు రవిచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనకు ఈ పదవి కట్టబెట్టిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కనుమూరు కృతజ్ఞతలు చెప్పారు. తనకు కేటాయించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ పదవి రవిచంద్రారెడ్డికి రావడంతో ఆయన అభిమానులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


## ఆయన... పోయి వచ్చెను హస్తినకు!!

ముఖ్యమంత్రి జగన్ ఏప్రిల్ 5వతేది మంగళవారం ఢిల్లీ వెళ్ళొచ్చారు. ఒకే ఒక్కరోజు సుడిగాలి పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా, ఆర్ధిక మంత్రి నిర్మలా సీతా రామన్‌లను కలుసుకున్నారు. పనిలో పనిగా మరో ఇద్దరు కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, గజేంద్ర షెకావత్‌లను కూడా కలిసి హాయ్ చెప్పి 6వతేది రాష్ట్రానికి తిరిగొచ్చారు. పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన హామీలపై చర్చించారు. సవరించిన పోలవరం అంచనాలు వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అస్తవ్యస్థంగా ఉన్న అనేక రహదారులను అభివృద్ధి చేయవల సిందిగా కోరారు. ప్రధానితో పాటు ఇతర మంత్రులను కలిసినప్పుడు ఆయా శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరతగతిన పూర్తి చేయమని అభ్యర్ధించడంతో పాటు, కొత్తగా చేపట్టవలసిన పనులను కూడా ముఖ్యమంత్రి జగన్ ప్రతిపాదించి మంత్రుల ముందుంచారు.

## ఊరికి వెళ్లొచ్చేలోగా.. ఇల్లు గుల్ల

ఇళ్ళ తాళాలు పగులగొట్టి.. దర్జాగా ఇంట్లో జొరబడి ఉన్న దంతా దోచుకుపోయే ముఠా జోరు పెరిగిపోయింది. జిల్లాలో ప్రతిరోజూ ఎక్కడో ఓచోట ఇలాంటి దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. కావలి పట్టణంలో కూడా ఇదేవిధంగా చోరీ జరిగింది. భుజంగరాయశర్మవీధిలో ఉండే పసుపులేటి గోపీకృష్ణ తన కుమా రుడి పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 29న హైదరాబాద్‌కు వెళ్ళి ఉండగా దొంగలు అది గమ నించి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నదంతా ఊడ్చుకుపోయారు. ఈనెల 4వ తేదీన ఆ ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నట్లు ఇరుగు పొరుగు వారు సమాచారం అందించడంతో, గోపీకృష్ణ వచ్చి చూసుకునే సరికి.. బీరువాలోని సుమారు 2 లక్షల 30వేల విలువచేసే 10 సవర్ల బంగారు వస్తువులు, కేజీ బరువున్న వెండిగిన్నె దొంగల పాలైపోయాయి. దీంతో లబోదిబోమంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కావలి సిఐ శ్రీని వాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## బహుగ్రంథ రచయిత..అగస్త్యరాజు సర్వేశ్వరరావు కన్నుమూత



బహుగ్రంథ రచయిత, నెల్లూరుసీమకు చెందిన ప్రముఖ పద్యకవిపండితునిగా ప్రసిద్ధిచెందిన అగస్త్యరాజు సర్వేశ్వరరావు అస్వస్థతతో ఈనెల 6వ తేది బుధవారం సాయంత్రం నెల్లూరులోని తన కుమార్తె నివాసంలో కాలధర్మం చెందారు. ఆయన వయసు 98ఏళ్ళు. స్వస్థలం నెల్లూరుజిల్లా వరికుంటపాడు మండలంలోని 'గువ్వాడి'గ్రామం. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. నెల్లూరులోని ప్రముఖ పద్యకవి అగస్త్యరాజు సుబ్బారావుకు ఆయన పెదమ్మ కుమారుడు..(అన్న) అవుతారు. తొలి నుంచి సర్వేశ్వర రావుకు పద్యకవిత్వమంటే ఇష్టం. బిఏ బిఇడి పూర్తిచేసి, ఉపా ధ్యాయవృత్తిలో ఉంటూ ఎన్నో రచనలు చేశారు. ఆ తర్వాత ప్రధానోపాధ్యాయులయ్యారు. ప్రైవేటుగా ఎం.ఏ కూడా చదివి కనిగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, అనంతరం అద్దంకి కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ రిటైరయ్యారు. ఆయన రచించిన 'శ్రీరామ సుధా తరంగిణి' గ్రంథం మైసూరు యూనివర్సిటీలో డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఉంది. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'గీతాంజలి'ని ఆయన తెలుగులో 'ఆంధ్ర గీతాం జలి'గా ఆంధ్రీకరించి సాహితీసీమలో పేరెన్నిక గన్నారు. గతంలో డిప్యూటి స్పీకర్‌గా ఉన్న మండలి బుద్ధప్రసాద్ ఆయన్ను 'ఆంధ్ర ఠాగూర్' అనే బిరుదుతో సత్కరించారు కూడా. 'కావ్యకళా కృపీవల', 'మధుర కవి' అనే బిరుదులు కూడా ఆయనకున్నాయి. వారు రచించిన 'వేదాంత పదకోశము', 'శ్రీ మాతా గాయత్రీ మంత్ర మహత్మ్య వివరణము', 'విశ్వవేదన' అనే గ్రంథాలు సారస్వత లోకప్రసిద్ధాలు. గేయకవిగా కూడా ఆయన సుప్రసిద్ధులు. వారి మరణంతో నెల్లూరుసీమ కవిలోకం ఒక పెద్దదిక్కుని కోల్పోయినట్లయింది. ఆయన మరణానికి చింతిస్తూ.. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తోంది 'లాయర్'!..


లాయర్
విజయపథంలో నెల్లూరీయులు




కాఫీటేబుల్ బుక్ కొరకు
9246431984 నెంబరుకు
గూగుల్‌పే లేదా ఫోన్‌పే
ద్వారా రూ.1,000/- (వెయ్యి రూపాయలు)
పంపించి పొందవచ్చును.
వాట్సాప్ ద్వారా మీ ఫోన్ నెంబరు,
చిరునామా తెలియజేస్తే..
కొరియర్ / ర్యాపిడో ద్వారా మీకు పంపిస్తాం.
- మేనేజర్, సర్క్యులేషన్



నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని లాయర్ పత్రిక కార్యాలయం నందు కూడా పొందవచ్చును.


## వైసిపి ఎమ్మెల్యేలలో కొత్త భయం!

(మొదటి పేజీ తరువాయి)

మండలి మొత్తాన్ని రద్దుచేసి రామారావు సంచలనం సృష్టించారు. తన మార్కు రాజకీయాలను ఆంధ్ర పాలిటిక్స్‌లో చూపించారు. ఆ తరువాత రామారావు పార్టీని చంద్రబాబు లాక్కోవడం, రామారావు పరమపదించడం, 1994 నుండి 2004 వరకు చంద్రబాబు అధికారంలో ఉండి రాష్ట్రంలో సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీగా గుర్తింపు పొందడం... ఇదంతా ఉమ్మడి రాష్ట్ర చరిత్ర. 2004 తరువాత పదేళ్ళకు మళ్ళీ విభజన ఆంధ్రాలో చంద్రబాబు తొలి ముఖ్యమంత్రిగా అధికారపగ్గాలు చేపట్టారు. 2019 కల్లా పూర్తిస్థాయిలో అప్రతిష్టపాలై 151 సీట్లతో జగన్‌మోహన్‌రెడ్డికి అధికారం అప్పజెప్పారు.

### గత పార్టీలతో పోలిస్తే...

గతంలో అటు కాంగ్రెస్‌లోనూ, రామా రావు హయాంలోని తెలుగుదేశంలోనూ, ఆ తరువాత చంద్రబాబు చేతికొచ్చిన టీడీపీలోనూ ఇప్పుడు వైసీపీలో ఉన్న లాంటి పరి స్థితులు ఏనాడూ లేవు. పార్టీలో ఏకఛత్రాధి పత్యం ఎప్పుడూ కొనసాగలేదు. కాంగ్రెస్ పార్టీలో అన్ని విషయాలలో పార్టీ అధిష్టానమే నిర్ణయం తీసుకునేది. దివంగత నేత రాజ శేఖరరెడ్డి జమానా వచ్చేవరకు ముఖ్యమంత్రిని కూడా ఢిల్లీ పెద్దలే నిర్ణయించేవారు. ఆ ఆనవాయితీకి ఫుల్‌స్టాప్ పెట్టిన తొలి కాంగ్రెస్ నేత రాజశేఖరరెడ్డే. 294 సీట్లకు గాను 292 మంది పేర్లను ఒకే సారి ప్రకటించిన ఘనత వైయస్సార్‌ది.

కొత్తగా పార్టీ పెట్టిన తొలినాళ్ళలో రామారావు సైతం టిక్కెట్ల కేటాయింపులలోను, మంత్రివర్గ కూర్పులలోనూ బెజవాడ పాపిరెడ్డి, నాదెండ్ల భాస్కరరావు, నల్లపరెడ్డి శ్రీని వాసులరెడ్డి వంటి సీనియర్ రాజకీయవేత్తల అభిప్రాయాలు తీసుకునేవారు. ఒకరిద్దరి విషయంలోతప్ప వాళ్ళు ఇచ్చిన సలహా ప్రకారమే నిర్ణయాలు తీసుకునేవారు. ఆ తరువాత చంద్రబాబు టైంలో కూడా సీనియర్లకు కొంతలో కొంత ప్రాధాన్యత ఉండేది. టిక్కెట్ల కేటాయింపులలోనూ, మంత్రివర్గ కూర్పులలోనూ చాలావరకు పేర్లు బయటకు వచ్చేవి. అలా వచ్చిన పేర్లలో 95 శాతం నిజమయ్యేవి. అవి అప్పటి రాజకీయాలు.

### జగన్‌మోహన్‌రెడ్డి స్టైలే వేరు...

ఊహించని విజయంతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి తీరే వేరు. ఆయన మనసులో ఏముందో ఎవరూ ఊహించలేరు. బహుశా చివరి నిముషం వరకూ తానేం చేయబోతున్నాడో తనకు కూడా తెలియదేమో అన్నంత గుంభనంగా తన పని తాను చేసుకుపోతారు జగన్. ఇప్పటివరకు ఆంధ్ర రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రులలో అతి చిన్న వయస్కుడిగా పిలువబడే జగన్, రాజకీయ వ్యూహ ప్రతివ్యూహాలలో అపర చాణుక్యుడిగా, అత్యంత మేధావిగా ఖ్యాతికెక్కారు. న్యాయ స్థానాలలో వందల సంఖ్యలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు వస్తున్నా, రాష్ట్రం ఆర్థిక వనరులతో ఇబ్బంది పడుతున్నా... తాను పట్టిన పట్టు విడవకుండా, చెప్పిన మాట తప్పకుండా, చేసిన వాగ్దానాలు మరువకుండా పరిపాలన సాగిస్తున్నారు జగన్. పార్టీ అధికారంలోకి వచ్చి మరో నెలన్నరలో మూడేళ్ళు పూర్తికావస్తున్న తరుణంలో ఇప్పుడు మంత్రివర్గ మార్పులు చేయబోతున్నారాయన. ఎన్నికల ముందు ఏర్పాటు చేయబోయే మంత్రివర్గ కూర్పు ఎంతటి నాయకుడికైనా కత్తిమీద సాము లాంటిదే. జగన్ కాకుండా వేరెవరైనా అయ్యుంటే ఈ సరికే చాలామంది కాబోయే మంత్రుల జాబితా బయటకు వచ్చి ఉండేది. ఇక్కడ ఉన్నది జగన్ కాబట్టి ఒక్కొక్క జిల్లా నుండి ముగ్గురు లేదా నలుగురు పేర్లను రాజకీయ విశ్లేషకులు ఉటంకిస్తున్నారు. మీడియా కూడా ఎవరికి తోచిన ఊహాగానాలు వాళ్ళు చేసుకుంటున్నారు. చివరికి జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్ చేతికి లిస్టు ఇచ్చేవరకూ అది సస్పెన్సే. మరో రెండు రోజుల్లో ఎలాగూ ఆ సస్పెన్స్ వీడిపోతుంది.

### నాయకుల్లో మొదలైన కొత్త టెన్షన్...

ఓ వైపు కొత్త మంత్రులుగా వస్తామన్న ఆశలు ఉన్న వారిలో ఉత్తేజం, తమకి గ్యారంటీ అనుకుంటున్న వారిలో ఉత్సాహం, ఇప్పటికే ఉన్న మంత్రులలో ఉంటామా..? ఊడతామా..?? అన్న ఉత్కంఠ స్పష్టంగా కనిపిస్తుంటే.... మరోవైపు మంత్రి పదవుల సంగతి దేవుడెరుగు.. వచ్చే ఎన్నికలలో తమకు టిక్కెట్టు ఉంటుందా లేదా? అన్న భయం చాలామందిలో ఇప్పటినుండే పట్టుకుందంటున్నారు పార్టీ వర్గాలవారు. కొత్త పదవి రాకపోయినా చాలు.. ఉన్నది ఊడకొట్టకుండా ఉంటే చాలని అంటున్నట్లు పార్టీ వర్గాల మాట.

2019లో పార్టీ టిక్కెట్లు వచ్చిన వారు లాటరీ తగిలినట్లుగా భావించారు. అప్పట్లో టికెట్లు ఆశించిన చాలామంది చివరి నిముషంలో అది రాక భంగపడ్డారు కూడా. అయితే అలిగి పార్టీ మారినవారూ, పార్టీకి దూరమైనవారు కూడా చాలామందే ఉన్నారు. టిక్కెట్టు ఇవ్వలేని చాలామందికి ఏదోఒకటి చేస్తానని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటను ఆయన చాలావరకు నిలబెట్టుకున్నారు. 2019 ఎన్నికలలో గెలిచిన అనేకమందికి ఈసారి టిక్కెట్లు రావన్న ప్రచారం పార్టీవర్గాల్లో జోరుగానే సాగుతోంది. అయితే తమకు ఇప్పుడు ఎలాంటి పదవులు అక్కరలేదు... వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు ఇస్తే చాలు అన్న అభిప్రాయం ఎక్కువమందిలో ఉందని పార్టీశ్రేణులు చెప్తున్నాయి. పార్టీ మళ్ళీ అధికారంలోకి రావాలంటే తమ ప్రభావం ఏమీ ఉండదని, జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ఉచిత తాయిలాలే మళ్ళీ పార్టీని గెలిపిస్తాయన్న ధీమా అందరిలోనూ ఉందన్నది వారి ఆలోచన. టిక్కెట్టు ఇవ్వడంతో పాటు ఆర్థికంగా కూడా పార్టీయే తమకు అండగా నిలుస్తుంది కాబట్టి ఈసారి సునాయా సంగా గెలవగలమన్న ధీమా కూడా వారిలో కనిపిస్తోంది. కాబట్టి తమకు పదవులు కట్టబెట్టకపోయినా మళ్ళీ పోటీచేసే అవకాశమైనా కల్పించాలని సిట్టింగ్ ఎమ్మెల్యేలు వేడుకుంటున్నట్లు తాడేపల్లి సమాచారం. ఇప్పుడు మంత్రివర్గ మార్పుల మర్మంలాగానే ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఎంపిక కూడా చివరి నిముషం వరకు జగన్మోహన రహస్యంలాగా కొనసాగుతోంది. ప్రభుత్వ అధీనంలో నడిచే అధికార నిఘా విభాగం (ఇంటిలిజెన్స్)పై కానీ, సలహాదారుల పేరుతో తన చుట్టూ ఉన్న భజన బృందంపైన కానీ జగన్ ఆధారపడడని, తాను గట్టిగా నమ్మే 'పీకే సర్వే'పైనే ఎక్కువగా ఆధారపడి ఎవరిని ఉంచాలో ఎవరిని పీకేయాలో నిర్ణయిస్తారని పార్టీ పెద్దలు అభిప్రాయపడుతు న్నారు. కాబట్టి ఈసారి కూడా పీకే ఓకే అంటేనే సీటు...!

# 'శుభకృత్' శుభాలను చేకూర్చాలి

## 'ఉగాది' వేడుకల్లో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు



శ్రీ శుభకృత్ నామ నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ శుభం జరగాలని, ఈ ఉగాది సుఖ సంతోషాలను ప్రసాదించాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా, అకాల వర్షాలు, వరదలు దరి చేరకుండా సమృద్ధిగా పంటలు పండాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఆకాంక్షించారు. ఉగాది పండుగ రోజున నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో జరిగిన నూతన సంవత్సర ఉగాది వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ ఈ వేడుకలకు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత నూతలపాటి సుబ్బయ్య శాస్త్రి పంచాంగశ్రవణం చేశారు. శ్రీ శుభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరికీ ఆర్థికంగా, హార్థికంగా బాగుంటుందన్నారు.

### అలరించిన కవిసమ్మేళనం...

శుభకృత్ ఉగాదిని పురస్కరించుకుని ఈ సందర్భంగా నిర్వహించిన కవిసమ్మేళనంలో పలువురు కవులు, కవయిత్రులు పాల్గొని కవితాగానం చేశారు. అవ్వారు శ్రీధర్ బాబు, ములుగు లక్ష్మీ మైథిలి, పి.శివకుమార్, ఈతకోట సుబ్బారావు, నీలం స్వాతి, మోపూరి లక్ష్మీనరసింహం, జి.సుభద్రా దేవి, మద్దూరు శ్రీనివాసులు, తన్నీరు శశికళ, హస్తి మోహన్‌రాజు, షేక్ నజ్మా, ఇంద్రగంటి మధుసూదన్‌లు ఉగాది ప్రాశస్త్యం గురించి వినిపించిన కవితలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చేతులమీదుగా వీరందరికీ ఘన సన్మానాలు జరిగాయి. నగర మేయర్



పొట్లూరి స్రవంతి, రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి సైదాని, రాష్ట్ర సంగీత, నృత్య అకాడమీ చైర్‌పర్సన్ శిరీష, జిల్లా జాయింట్ కలెక్టర్లు హరేందిర ప్రసాద్, కుమారి జాహ్నవి, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఇంఛార్జి సంయుక్త కలెక్టర్ ఐసిడిఎస్ పీడీ శ్రీమతి రోజ్‌మాండ్, నెల్లూరు,కావలి రెవెన్యూ డివిజన్ అధికారులు హుస్సేన్‌సాహెబ్, శీనానాయక్, జిల్లా టూరిజం సాంస్కృతిక శాఖాకారి నాగభూషణం, జడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, డిఆర్డీఎ పీడీ సాంబశివారెడ్డి, డిపిఓ ధనలక్ష్మి, డిఇఓ రమేష్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఉషారాణి పాల్గొన్నారు. తొలుత, ప్రభుత్వ సంగీత కళాశాల వారిచే గణపతి ప్రార్థన నృత్యం, అంజనీ డాన్స్ అకాడమీ వారి నృత్యరూపకం, గురుకృప కళాక్షేత్రం వారి భామాకలాప నృత్యం, శ్రీ నటరాజ కళాక్షేత్రం, శ్రీ శివసాయి కళానిలయం వారి నృత్య రూపకాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

### కళామూర్తులకు సత్కారాలు...

ఉగాది సందర్భంగా జిల్లాలో వివిధ రంగాలకు చెందిన పలువురు కళామూర్తులను జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కర్ణాటక సంగీతం నుండి డి.వి.సురేష్ రావు, చిరంజీవి(డోలు వాద్యం) కె.నాగభూషణం(నాదస్వరం) శాస్త్రీయనృత్యంలో పి.అంజనీ కుమార్, జానపదనృత్యంలో వి.సతీష్‌కుమార్, హరికథా విభాగంలో టి.వాణిశ్రీ, నాటక రంగం నుండి లోకా సులోచన, శాంతికుమార్ (తబలా), వీరేపల్లి కిషోర్(శాక్సాఫోన్)లకు ఘనసన్మానాలు జరిగాయి. వైద్యరంగం నుండి డాక్టర్ దాక్షాయిణి ఉగాది పురస్కారం అందుకున్నారు.

# గండారపమ్మకు విశేష పూజలు



మండల కేంద్రమైన చేజర్ల గ్రామ దేవత గండారపమ్మ అమ్మవారికి ఈనెల 3న పెద్దఎత్తున విశేష పూజలు చేశారు. మండల పూజల్లో భాగంగా అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి అభిషేకాలు చేశారు. 41 రోజుల కిందట గండారపమ్మ ఆలయంలో అమ్మవారి నూతన విగ్రహాలను ప్రతిష్ఠించడంతోపాటు కలశప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠలు జరగడంతో గ్రామస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించి పూజలు చేశారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి పొంగళ్ళు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. భక్తులందరికీ గ్రామయువత అన్నదానం నిర్వహించారు. తప్పెట్లు తాళాలతో, బాణసంచా వేడుకలతో ఎంతో కోలాహలంగా ఈ కార్యక్రమాలు జరిగాయి.

# పడారుపల్లి గంగమ్మతల్లికి.. పొంగళ్ళు



నెల్లూరు నగర శివారుల్లోని పడారుపల్లిలో ఉన్న గంగమ్మ దేవాలయం పునర్నిర్మాణం జరుగుతున్న సందర్భంగా ఈనెల3న పెద్దసంఖ్యలో భక్తులు, ముఖ్యంగా మహిళలు పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మ తల్లి దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ పూజలు చేశారు. కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు కాకుటూరు శ్రీహరి, పుల్లయ్య, సుబ్బారావు, మల్లికార్జునరెడ్డి, మురళి, శేఖర్, మధు, ప్రతాప్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా @ 26 జిల్లాలు

# జయహో జగన్!!



మన ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రభుత్వాలకు సారథులు మారుతూ ఉండడం సహజం. మన దేశానికి ప్రస్తుతం ఉన్న నరేంద్ర మోదీ 14వ ప్రధాని అయితే, మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇప్పుడు అధికారంలో ఉన్న వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి 17వ ముఖ్యమంత్రి. ఇప్పట్లో కలియుగం అంతమయ్యే అవకాశాలు ఏమీ లేకపోవడంతో ఈ జాబితాలు అలా... అలా కొనసాగిపోతూనే ఉంటాయి.

తమ నాయకత్వ పటిమ వల్లనో..., నుదుటి రాత వల్లనో, అదృష్టం తన్నుకు రావడం వల్లనో అప్పటికి సమాజంలో నెలకొని ఉన్న రాజకీయ... సామాజిక పరిస్థితుల వల్లనో..., ప్రజల దురదృష్టం వల్లనో..., వారు కిందటి జన్మల్లో మూకుమ్మడిగా చేసుకున్న మహాపాపాల ఫలితంగానో కొందరు ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులుగా అవతరిస్తుంటారు. అయితే, చరిత్ర అందరినీ గుర్తుపెట్టుకోదు. ప్రజల జీవనంపై మంచో.... చెడో... అత్యంత బలమైన ముద్ర వేయగలిగిన వారిని మాత్రమే గుర్తుపెట్టుకుంటుంది.

మాటవరసకు భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూను, 'జై కిసాన్ – జై జవాన్' నినాదాన్ని దేశానికి అందించిన నిస్వార్థజీవి లాల్ బహదూర్‌శాస్త్రిని గానీ, బంగ్లాదేశ్ పుట్టుకకు కారణమైన ఇందిరాగాంధీని గానీ, తనదైన ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని చక్కదిద్దిన పీవీ నరసింహారావును కానీ, 'బీజేపీ మార్క్' రాజకీయంతో 'గుజరాత్ మోడల్'ను బాగా రంగరించి... దేశం మొత్తాన్ని కాషాయపరం చేసిన మోదీని గానీ, అంతకుముందు మొదటి బీజేపీ ప్రభుత్వంతో ప్రజల హృదయాన్ని గెలుచుకున్న వాజ్‌పేయిని గానీ చరిత్ర మరిచిపోదు.




అలాగే, 'నన్ను కాల్చండిరా....' అంటూ అంగ్రేయుల కాలంలో సైమన్ కమిషన్‌కు తన గుండెలు చూపించిన ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు గారిని గానీ, రాజకీయ నిబద్ధత, విలువలతో రాష్ట్రపతిగా ఎన్నికైన నీలం సంజీవరెడ్డి, తన సినీ సమ్మోహనాస్త్రంతో 9నెలల్లోనే అధికారం హస్తగతం చేసుకున్న ఎన్‌టీ రామారావును గానీ, సంక్షేమ, అభివృద్ధి పథకాలను కొత్త పుంతలు తొక్కించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని గానీ చరిత్ర ఎన్నటికీ మరిచిపోదు.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న వై.ఎస్ తనయుడు వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా ఆ జాబితాలో చేరారు. 25 జిల్లాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 13 జిల్లాలకు కుదించిన అమ్మా కొడుకులకు – 'మావి పదమూడు కాదు... ఇరవై ఆరు జిల్లాలు...' అని జగన్ చాటి చెప్పారు.

ఈ ఉగాది నుంచి ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలు 26 అయ్యాయి. భవిష్యత్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ(ఇంకో 30 ఏళ్ళ వరకు గెలవగలిగిన విషయం జగన్ దగ్గర ఉంది) ఈ నిర్ణయాన్ని తిరగతోడలేదు. జిల్లా అనేది ఆ జిల్లా ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశం. 'నేను ఫలానా జిల్లా వాడిని....' అని చెప్పుకోవడానికి ప్రతివారూ గర్వంగా.... గొప్పగా భావిస్తారు.

నిజానికి, పెద్ద జిల్లా.... చిన్న జిల్లా అనే అంశం పాలనా వ్యవస్థపై గతంలో ఉండేదేమో కానీ, ఇప్పుడు.. ఈ ఆధునిక, సాంకేతిక ఇంటర్నెట్ రోజులలో పాలనాపరమైన 'గ్యాప్'కు అసలు అవకాశమే లేదు. రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలోని మారుమూలన ఉండే కుగ్రామంలోని వ్యక్తితో వీడియోకాల్‌లో మాట్లాడవచ్చు.

మన ముఖ్యమంత్రి, తన కార్యాలయంలో నుంచే అనేక పథకాలను చిన్న బటన్ నొక్కి.... రాష్ట్రం మొత్తం లబ్ధిదారులకు నిధులను బట్వాడా చేయడాన్ని చూస్తున్నాం. అమలాపురంలో అప్పారావు గుడిసె హోటల్‌లో... ఇడ్లీ ఎలా చేస్తున్నాడో.... అమెరికాలో ఉన్న వాళ్ళమ్మాయి లైవ్‌లో చూస్తున్నది. అదీ ఇప్పటి టెక్నాలజీ.

అందువల్ల జిల్లాలు పెద్దవా... చిన్నవా అనేది సమస్య కాదు. ఢిల్లీలో కూర్చున్న నరేంద్ర మోదీ 135 కోట్ల జనాభాను కంటిచూపుతో ప్రభావితం చేస్తున్నారు. అయినప్పటికీ, ప్రజలు తమ తమ జిల్లాలతో మానసికంగా మమేకం అవుతారు. అదే ప్రధాన ప్రయోజనం. అందుకే, 10 జిల్లాలు మాత్రమే ఉన్న తెలంగాణను ముఖ్యమంత్రి కెసిఆర్ ఏకంగా 33 జిల్లాలు చేసేశారు.

ఆ లెక్కన చూస్తే, ప్రతి రెండు డివిజన్లకు ఒక జిల్లా చొప్పున ఆంధ్రప్రదేశ్‌లో 36 జిల్లాలకు అవకాశం ఉంది. అయినప్పటికీ జగన్ మాత్రం 26తోనే సరిపెట్టారు.

ఆంధ్రప్రదేశ్ ఉనికి అనేది దేశ చిత్రపటంలో ఉన్నంత కాలం ఈ జిల్లాలు ఉనికిలో ఉంటాయి. ఇందుకు ఓ చిన్న ఉదాహరణ చెప్పుకోవచ్చు.

తాలూకాలుగా ఉన్న రెవిన్యూ పాలనా వ్యవస్థను ఎన్‌టీ రామారావు రద్దు చేశారు. ఒక్కొక్క తాలూకాను రెండు, మూడు ముక్కలుగా విభజించి, మండల వ్యవస్థను తీసుకువచ్చారు. ఆయన మండల వ్యవస్థను తీసుకు వచ్చిన 30 ఏళ్ళ తరువాత కూడా అదే వ్యవస్థ కొనసాగుతోంది. ఈ 'మార్పు' ప్రజలను అమితంగా ప్రభావితం చేస్తోంది.

అలాగే, జగన్ చేసిన జిల్లాల పునర్విభజన కూడా కలకాలం ఉనికిలో ఉంటుంది. విభజన చేసిన ముఖ్యమంత్రిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారు.

అయితే, అసలు సమస్య వికేంద్రీకరణ చెయ్యడమా... చెయ్యకపోవడమా అనేది కాదు. జిల్లాల విభజన వల్ల, విభజిత జిల్లాల్లోని ప్రజల జీవనంలో గుణాత్మకమైన మార్పు ఏమైనా వచ్చిందా? విభజనకు ముందు కంటే.... విభజితమైన తరువాత.... పాలన తీరు మెరుగుపడిందని ప్రజలు భావిస్తున్నారా? ప్రభుత్వ సేవల యంత్రాంగం ప్రజలకు మరింత ఉపయోగకరంగా మార్పు చెందిందా? చేరువ అయిందా? మొదలైన అంశాలపై ప్రభుత్వం ఒక అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

13 జిల్లాలు, 52 రెవెన్యూ డివిజన్లుగా ఉన్న రాష్ట్రంలో 26 జిల్లాలు, 72 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు చేయడం వల్ల.... ప్రజలు ప్రభుత్వ యంత్రాంగపు పనితీరుతో సంతృప్తిగా ఉంటే ప్రభుత్వ డెలివరీ మెకానిజం మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తోందని ప్రజలు భావిస్తూ ఉంటే... జగన్ ప్రయోగం విజయవంతం అయినట్టే.

జిల్లాలలో 95 శాతం మంది ప్రజలకు కలెక్టర్ ఆఫీస్, పోలీస్ సూపరింటెండెంట్ ఆఫీస్‌తో దాదాపుగా పని బడదు. గ్రామీణులకు పోలీస్‌స్టేషన్, ఎం.ఆర్.ఓ ఆఫీస్, ఎం.డి.ఓ ఆఫీస్‌తోనే పనులు ఎక్కువ. ఇవి జిల్లాల పునర్విభజనకు ముందు ఎక్కడ ఉండేవో.. ఇప్పుడూ అక్కడే ఉంటాయి.

అందువల్ల, ఈ కార్యాలయాలు విభజనకు ముందు ప్రజలతో ఎలా వ్యవహరించేవో... ఇప్పుడూ అలాగే వ్యవహరిస్తాయని భావించవచ్చు. పట్టణాలు, నగరాలలోని వారికి అదనంగా మున్సిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్ల బెడద ఉంటుంది. ఈ కార్యాలయాలకు తిరుగుతూ ఉండడంతోనే 90 శాతం మంది జీవితాలు తెల్లారిపోతుంటాయి.

13 మంది కలెక్టర్లు 26 మంది అయినా, లేక 13 మంది ఎస్పీలు 26 మంది అయినా, 52 మంది ఆర్డీవోలు 72 మంది అయినా... వారి పర్యవేక్షణలో పనిచేసే ఎం.ఆర్.ఓ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లలో పనితీరు మెరుగుపడిందని ప్రజలు భావించినప్పుడే... ముఖ్యమంత్రి ఆశించిన లక్ష్యం నెరవేరినట్టుగా సంతోషించవచ్చు.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# మీ సేవాభావానికి సెల్యూట్!

## - 'వలంటీర్లకు వందనం' చేసిన సిఎం



'వలంటీర్ వ్యవస్థ' అనే సేవాభావానికి సెల్యూట్ చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల సేవలను ప్రశంసించారు. రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందని, ఇప్పుడు దేశం మొత్తం ఆ వ్యవస్థవైపు చూడడం గర్వంగా ఉందని ఆయన అన్నారు.

ఈనెల 7వతేది గురువారం పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో జరిగిన రెండవ ఏడాది వలంటీర్ల వందనం కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. ఎలాంటి వివక్ష లేకుండా, లంచం, అవినీతిలకు తావు లేకుండా, కులమత రాజకీయాలతో పనిలేకుండా ఒక మంచి వ్యవస్థ కోసం కల గన్నామని, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఆ కల సాకారమైందని ఆయన అందరి హర్షధ్వానాల మధ్య సంతోషంగా చెప్పారు. రాష్ట్రంలో 2 లక్షలా 60వేల మంది వలంటీర్లు, లక్షలాదిమందికి పైగానే ఉన్న లబ్దిదారులకు సేవలందించేందుకు అహరహం కృషి చేస్తున్నారని, అలాంటి సైనికులకు ప్రభుత్వం తరఫున చిరుసత్కారం చేస్తున్నామని అన్నారు.

### ప్రజల ముంగిటికే పాలన - కలెక్టర్



ప్రజల ముంగిటికే పాలన తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేస్తున్న కృషి వలంటీర్ వ్యవస్థతో సాధ్యమైందని ఈ కార్యక్రమంలో నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు అన్నారు. గత మూడేళ్ళుగా వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందజేస్తున్నారని, జిల్లాలో 12 రకాల పింఛన్లను మొత్తం 3.80 లక్షల మందికి ప్రతి నెలా 1వ తేదీన అందిస్తూ లబ్దిదారుల్లో సంతోషం నింపుతున్నారని కలెక్టర్ కొనియాడారు. వైఎస్సార్ బీమా, ఆసరా, చేయూత, జగనన్నతోడు, చేదోడు, రైతుభరోసా ఇలా 28 ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు ఎంతో కీలకంగా సమర్ధవంతంగా సేవలందిస్తున్నారని, సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లను సత్కరించాలనే ఉద్దేశంతో సిఎం 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆయన వివరించారు.

### వలంటీర్లకు నగదు బహుమతులు.. ఘన సత్కారాలు :

జిల్లాలో 16,460 మంది వలంటీర్లు పనిచేస్తున్నారని, వారిలో 13,815 మందికి 'సేవామిత్ర' పురస్కారం కింద ఒక్కొక్కరికి 10వేల రూపాయలు, మరో 285 మందికి 'సేవారత్న' పురస్కారం కింద ఒక్కొక్కరికి 20వేల రూపాయలు, ఇంకో 50 మందికి 'సేవా వజ్ర' పురస్కారం కింద ఒక్కొక్కరికి 30వేల రూపాయలు బహుమతిగా అందజేసి ప్రశంసాపత్రం, మెడల్, శాలువతో సత్కరిస్తామని కలెక్టర్ వివరించారు. 20 రోజుల పాటు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్, నగర మేయర్ స్రవంతితో పాటు పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్మృత్యంజలి

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ।
తస్మాదపరిహార్యేర్థే న త్వం శోచితుమర్హసి॥



శ్రీమతి బయ్యపురెడ్డి భారతి గారు

జననం: 10.6.1971 స్వర్గలోకప్రాప్తి : 7.4.2018

మా తృతీయ సోదరి

**శ్రీమతి బయ్యపురెడ్డి భారతి గారి**

4వ వర్ధంతి సందర్భంగా వారి దివ్యస్మృతిని స్మరించుకుంటూ..
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

తమ్ముడు : **మల్లిఖార్జునరెడ్డి కైపు**
రాంజీనగర్, నెల్లూరు.
Portland, USA.
మరియు **కుటుంబసభ్యులు**



జననం : 01.07.1938 మరణం : 13.04.2021

## శ్రద్ధాంజలి

పెద్దలు, స్ఫూర్తిప్రదాతలు

**కాటంరెడ్డి వేణుగోపాలరెడ్డి** గారు

పరమపదించి తే. 13.04.2022ది నాటికి ఏడాది గడవనుంది.
వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ..

**కాటంరెడ్డి హంసవేణి** - భార్య

కుమార్తెలు - అల్లుళ్ళు

**కందల ప్రశాంతి - కందల బాబా ప్రసాద్‌రెడ్డి**
**జక్కా లక్ష్మీప్రసన్న - జక్కా శివనారాయణరెడ్డి**
**యేటూరు ప్రవీణ - యేటూరు వసుధర్‌రెడ్డి**

మనుమలు మనుమరాళ్ళు

**గిరిధర్‌రెడ్డి, గౌతమి**
**కళ్యాణ్‌రంగారెడ్డి, స్వాతి, శ్వేత**
**సందీప్‌రెడ్డి, శ్రేయ**

మరియు

**ఇతర కుటుంబసభ్యులు**

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com